57371
57373

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

డిసెంబర్ 6, 2009



కథా నిలయం
శ్రీకాకుళం

తెలుగు విలనీ తెర మరుగేనా!

హ్యాపీబర్త్‌డే

(2009 డిసెంబర్ 6 నుంచి 2009 డిసెంబర్ 12 వరకు)

కె. దీక్షిత
5సం॥,డిసెంబర్-8
ఇందిర-సుధీర్
తాటిపాముల-నల్లగొండ

టి. సుజన్(బిట్టు)
డిసెంబర్-8
పద్మ-వీరారెడ్డి
విద్యానగర్-నల్లగొండ

కె. సందీప్
5సం॥, డిసెంబర్-2004
మాధవి-బసవయ్య
పిల్లాయిపల్లి-నల్లగొండ

బి. ఉత్తేజ్
7సం॥,డిసెంబర్-2002
విజయ-సోమన్న
తాటిపాముల-నల్లగొండ

ఎం. సంజయ్
1సం॥,డిసెంబర్-2008
సుచరిత-నాగేష్
నల్లగొండ

ప్రణయ్
5సం॥,డిసెంబర్-2004
సుచరిత-నాగేష్
నల్లగొండ

సాయి కుమార్
డిసెంబర్
ప్రభావతి-ఆంజనేయులు
యనమలకుదురు-కృష్ణా

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

సిహెచ్. నిహారి
8సం॥,డిసెంబర్-12
సునీత-గోపి
మామిడికుదురు-తూ॥గో

మనలో మాట

అంతా కల్తీమయం!



అసలు పుట్టినప్పుడే కచ్చితంగా కల్తీ కూడా పుట్టి ఉంటుంది. 'అసలు'కు ఉన్న ఆదరణే ఈ 'నకిలీ' ఆవిర్భావానికి కారణం! కాబట్టి- అసలూ నకిలీ బొమ్మాబొరుసు లాంటివి. వెలుగూనీడ వంటివి. అసలు అసలులా ఉండడంలో పెద్ద గొప్ప ఉండకపోవచ్చు. కష్టమూ కాకపోవచ్చు. కానీ, కల్తీ శాల్తీ నకిలీలా కాకుండా అసలులా ఉండాలి. అనుమానం రాకుండా ఉండాలి. అచ్చం అసలులా ఉండాలి. ఇదెంత కష్టమో అర్థం చేసుకుంటే- కల్తీ లేదా నకిలీ గొప్పతనం అవగతమవుతుంది. ఇది అర్థమయ్యే కాబోలు, మన తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఉద్యమంలా చేపట్టిన 'కల్యాణమస్తు'లో పెళ్లికుమార్తెలకు కల్తీ మంగళసూత్రాలు పంపిణీ చేశార్ట! ఆ మధ్య నల్గొండ జిల్లాలో కల్యాణమస్తు దంపతులు ఆ 'తిరుపతి బంగారానికి' గీత పెట్టిస్తే- కల్తీ బయటపడింది! మంగళసూత్రాల్లోనే కాదు, కల్యాణమస్తులో ఇచ్చిన వెండిమట్టెల్లోనూ కల్తీ ఉందట!

సాక్షాత్తూ దేవస్థానం వితరణలోనూ ఇంత దగాయా అని నోరెళ్లబెట్టి ఉపయోగం లేదు. మన పురాణాల్లో మాత్రం... ఇలాంటి ఉదంతాలు బోలెడు లేవా? దేవతల ప్రభువు దేవేంద్రుడి నకిలీ 'వేషాలు' అన్నీ ఇన్నీ కావు! కోడిలా కూయడం, మునిలా దర్శనమివ్వడం గట్రా గట్రా కల్తీ పనులెన్నో చేశాడు కదా. బలి చక్రవర్తిని తొక్కేయడానికి మహా విష్ణువూ కపట బ్రాహ్మడి వేషం కట్టాడు. ఇక శ్రీకృష్ణుడి లీలలన్నీ నకి'లీలలే!' ఇలాంటి దృష్టాంతాలెన్నో పురాణాల నిండా ఉన్నాయి కనక- కల్తీ ధర్మ సమ్మతమేనని పెద్దలు నొక్కివక్కాణించినా- వక్కాణిస్తారు!

శ్రీ వేంకటేశ్వరుడు అవునో కాదో తెలియదు గానీ, కల్తీ మాత్రం సర్వాంతర్యామి! ఇందుగలదందు లేదన్న సందేహంబు అక్కర్లేదు. కల్తీకి అవకాశం లేని శాల్తీ బహుశా కల్తీ ఒక్కటేనేమో! అందుకని- కల్తీ లేని చోటు భూమండలమంతా వెదికినా దొరకదు అని ఢంకా భజాయించవచ్చు. ఇప్పుడు నీరు కల్తీ, గాలి కల్తీ, రోడ్డు కల్తీ, పుడ్డు కల్తీ! ఓటు కల్తీ, నోటు కల్తీ, మాట కల్తీ, మనసు కల్తీ! కల్తీ ఎక్కువయ్యేకొద్దీ 'అసలు'కు ఇమేజీ పెరుగుతుంది. ఆదరణ పెరుగుతుంది, 'ధర' పెరుగుతుంది. ఉదాహరణకు నీరు కలుషితమైంది. దరిమిలా సీసాల్లోకెక్కిన నీటికి రేటు పెరిగింది. ఇంకా దాని చుట్టూ లెక్కలేనన్ని వ్యాపారాలు పెరిగాయి. అందువల్ల- 'కల్తీ వల్ల వర్తకం వర్ధిల్లుచున్నది.' అని కూడా అనుకోవచ్చు.

కల్తీ అనేది వస్తువులకూ, వర్తకానికే పరిమితం కాదు. రాజకీయాల్లో అది ఎప్పుడో కలగలిసి పోయింది. ఒకప్పటి రాజకీయ లక్ష్యం ప్రజాసేవైతే ఇప్పుడు స్వయంసేవ! స్వాతంత్ర్య కాలం నాటి ఖద్దరు వేరు, ఇప్పటి ఖద్దరు వేరు! అప్పుడు జాతీయాకరణ... ఇప్పుడు ప్రైవేటీకరణ! అందుకనే 'అంతా కల్తీమయం. జగమంతా కల్తీమయం' అని పాడుకోవల్సి వస్తోంది!

★

ఈ సంచికలో....

టపా	...	2
వికాసం	...	3
కవిత్వమ్	...	6
రుచి	...	7
కథ	...	8
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
విజ్ఞాన వీచిక	...	18
నవ్వుల్ పువ్వుల్	...	19
క్రైమ్ కథ	...	20
తెలుసుకుందామా	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

ఇదో పాఠ్యగ్రంథం



చూద్దామా ... 10

అబ్బురపరిచే బెలుం గుహలు

పిలవని పేరంటం ... 22



చూసినట్టే...

శ్రీశైలం డ్యామ్ సుందర దృశ్యం ముఖచిత్రంతో 'స్నేహ' అట్టమీది కథ ద్వారా శ్రీశైలం సందర్శించినంత చక్కని అనుభూతి కలిగింది. 'చుద్దామా'లో కుశీనగర విశేషాలు బావున్నాయి. చిన్నకథ 'కొవ్వొత్తి' రచయిత తంగిరాల చక్రవర్తి గారికి అభినందనలు. 'కొత్త పుస్తకాలు' శీర్షిక ఉపయుక్తంగా ఉంటోంది. 'తెల్సా' పేజీ అంటే మాకెంతో క్రేజ్. 'సినిమా కబుర్లు' నిడివి పెంచి అందించడం అభినందనీయం. 'బాలనేస్తాలు' లో 'చేసేద్దాం' బిట్ మాకెంతో ఇష్టం. 'గుర్తుకొస్తున్నాయి' శీర్షిక సైతం ఎంతో ఆసక్తికరంగా వుంటోంది. 'ఆరోగ్యం' ద్వారా 'ఆస్తమా' ఎలా వస్తుందో అవగాహన కలిగించారు. కె. అంజనగారి 'వికాసం' కాలమ్ చాలా విలువైన సున్నిత అంశాల్ని స్పృశించడం గమనార్హం. 'మనలోమాట' కాస్త వ్యంగ్యంగా చెప్పినా 'బాలల దినోత్సవం'లో జరిగే భారతాన్ని ప్రస్తుతించటం సమంజసంగా వుంది. ఆ చిత్రాల తీరు, రీతి మారతాయని ఆశిద్దాం.

– నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

అందరూ తెల్సుకోవాల్సినవే

నవంబర్ 22 ఆదివారం స్నేహ కవర్‌పేజీ అచంచలం. శ్రీశైలం విశేషాలు హైలైట్. తెలియని వారు కూడా శ్రీశైలం ప్రకృతి దృశ్యాలు, ప్రాజెక్టు విషయాలు, డ్యామ్ సంగతులు, విహార స్థలాలు తెలుసుకోవలసినవే.

ఆచార్య నూతినారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

సంక్రాంతికి చూడాలనుకున్నాం

నవంబర్ 22 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో 'అట్టమీది కథ' అచంచలం. శ్రీశైలం కవర్‌స్టోరీ చదివిన తర్వాత అనేక విషయాలు తెల్సుకున్నాం. గత ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నాం. కానీ మొన్న వరదల ధాటికి డ్యాం పూర్తిగా మునగడం, భారీ నష్టం జరగడం బాధాకరం. ఇక్కడే శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి కొలువుదీరి ఉండడం, 12జ్యోతిర్లింగాల్లో రెండవదిగా ప్రసిద్ధి చెందడం మనకు గర్వకారణం. ఆలయం బయట చూడాల్సిన ప్రదేశాల గురించి చదివి మా విద్యార్థులకు కూడా వివరించాను. సంక్రాంతి సెలవుల్లో వెళ్లడానికి ప్లాన్ చేసుకుంటున్నాం.

కామిడి సతీష్‌రెడ్డి,
పరకాల, వరంగల్.

మేక తెలివి బావుంది

స్నేహలో ప్రచురించిన శ్రీశైలం ప్రాజెక్టు, అద్భుతమైన ప్రకృతి సౌందర్యాలు, శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానాల గురించి, అక్కడున్న ప్రాంతాల గురించి ఈ వారం చాలా చక్కగా తెలియజేశారు. ఇంత చక్కని ప్రదేశం గురించి తెలియజేసిన పానుగంటి చంద్రయ్యగారికి అభినందనలు. అలాగే చూద్దామాలో కుశీనగర్ బుద్ధుని విగ్రహం, మూడు ముక్కలుగా లభించడం గమనార్హం. అంతే కాకుండా మ్యూజియంలో పెట్టిన వస్తువులు, విగ్రహాల గురించి తెలియజేశారు. పిల్లలు చదువుతున్నప్పుడు తల్లిదండ్రులు గమనిస్తుండాలి. తల్లిదండ్రులను బట్టి పిల్లలు మూగజీవులై పోతున్నారు. స్కూల్‌కి వెళ్లి ఉపాధ్యాయులతో పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకోవాలి. చీటికీమాటికీ వాళ్లని విసిగించకూడదు. తల్లిదండ్రులను వదిలి ఎక్కడో దూరాన హాస్టల్లో చదువుతున్నవారు మానసిక వేదనతో బలైపోతున్నారు. వారిని కూడా ఉపాధ్యాయులు గమనించాలి. అంజనగారు ఈ వారం మంచి మాటతో మనసు కదిలించారు. వారికి మా ధన్యవాదాలు. తెల్సా ద్వారా గమ్మత్తైన విషయాలను తెలియజేస్తున్నారు. ఈవారం తలపుల తడిలో వి. సూర్యారావుగారు అందించిన కవిత్వమ్ చాలా బాగుంది. వారికి కృతజ్ఞతలు. బాల నేస్తాలులో బూర తాబేలు చేద్దామా చాలా తమాషాగా అనిపించింది. పిల్లలు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇంకా మంచి మంచి బొమ్మలు అందిస్తారని కోరుతున్నాం. పొడుపు కథలు చాలా బాగుంటున్నాయి. అలాగే సంతకం కూడా. చివరి పేజీలో మేక తెలివి కథ చాలా బాగుంది. చదువుతున్న కొద్దీ చదవాలనిపిస్తుంది. చెర్రీగారికి అభినందనలు. అలాగే చాలా విషయాలు తెలియజేసిన స్నేహకి కూడా అభినందనలు.

అనుపోజు సంతోషినాగరాజు,
పూల్‌బాగ్ కాలనీ, విజయనగరం.

నిజంగా చిరస్మరణీయం

కట్టా శేఖర్ రెడ్డి గారు తన గతం మరవకుండా తనను తాను మార్చుకున్న వైనాన్ని రాయడం బావుంది. నాలో చిరస్మరణీయంగా వుండిపోయేట్టు రాశారు. కమ్యూనిస్టు ప్రణాళిక గొప్పదనం చూపించారు. కేరళలో పున్నప్రవాయిలార్, అలాగే మాప్లాస్ పోరాటాలు కూడా గొప్ప చరిత్ర గలవే. గొల్ల అప్పన్న తన రెండెకరాల భూమిని అమ్మి, వేరొక చోట ఐదెకరాలు భూమిని కొన్నాడు. హైవే రోడ్‌కి తన భూములు పోతే దానికి వచ్చిన నష్ట పరిహారంతో కూతురు పెళ్లి జరిపించుకున్నారు. ఎవరూ డబ్బు రూపాన నష్టపోలేదు. కానీ గ్రామ సంస్కారం పోయి లంచంతో పట్టణ కల్చర్ వచ్చి



పడింది. అనభవజ్ఞురాలు అమ్మమ్మ తన వెండి కడియాలు అమ్మించి సమస్యకు పరిష్కారం చూపించింది. లంచమన్నది ఈ సమాజంలో తప్పని రుజువు చేసింది. సోషలిస్టు దేశాల నాయకులతోనూ, వర్ధమాన దేశాల నాయకులతోనూ కలుసుకుని మాట్లాడిన చేగువేరా, ప్రపంచ నాయకుడిగానే చరిత్రలో వున్నాడని డాక్టర్ రాధాకృష్ణమూర్తి గారు తెలియజేశారు. ఇది కూడా కథాంశంగానే భవిష్యత్‌లో ప్రజలకు చూపించడానికి వుంది. శ్రీశైలం డ్యాం మానవ నిర్మిత కోహినూర్ వజ్రం. రాళ్లసీమను రత్నాల సీమగా చేసే జాతి సొత్తు ఇది. దీన్ని సంరక్షించుకోడానికి ఎప్పటికప్పుడు తగిన నిధులు ప్రజా ప్రభుత్వాలు ఇచ్చి, పరామర్శించుకోవాలి. ఇందుకు అశ్రద్ధ జరిగితే ఇది ఇచ్చే నష్టం చెప్పనలవి కాదు.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారి పేట, విజయవాడ.

అచంచల శ్రీశైలం

పిల్లల పాత్రలను అరవయ్యేళ్ల వృద్ధులు వేయడం విడ్డూరం. అలాగే పిల్లలను పిల్లల్లాగే పెరగనివ్వక ముదురు మాటలతో వివిధ పాత్రలు చేయించడం పనికిరాదు. పాతాళగంగ మల్లన్నను దృష్టిలో వుంచుకోవాలనడం బాగుంది. ఇంజనీర్ల ప్రతిభకి, నిజాయితీకి శ్రీశైలం ప్రాజెక్టు నిదర్శనం. బౌద్ధుల పుణ్యక్షేత్రం కుశీనగర్ చూడాల్సిందే.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

★

వికాసం

గెలుపు - ఓటమి

- సంధ్య



పిల్లలు తాము అనుకున్న మార్కులు రాకపోయినా, ఆటల్లో గెలవకపోయినా చాలా బాధపడతారు. ఏదో కోల్పోయిన వారిలా ఉంటారు. తొందరగా మళ్లీ అందరిలో కలవలేరు. అదే తల్చుకుంటారు. వారితో పాటు పెద్దలు కూడా 'అయ్యో చిన్నూగాడు ఫస్టు ర్యాంకు తెచ్చుకోలేకపోయాడే' అనో, 'పాపం వాడు బాగా ఫీలవుతున్నాడు' అనో వారికంటే ఎక్కువగా బాధపడుతుంటారు. మరికొందరైతే తమ హోదాకు తగ్గట్టుగా ఫస్టు ర్యాంకు రాలేదని కూడా ఫీలవుతారు.

కానీ అలా చేయడం వల్ల పిల్లలు మరింత డీలా పడిపోతారు. ఒక్కోసారి ఆ ఆటను తామెప్పటికీ ఆడకూడదని నిశ్చయించుకుంటారు. ఎంత చదివినా అంతేలే అన్నట్టు చదువుమీద కూడా, అంతగా శ్రద్ధ చూపరు. ఒకసారి విజయం సాధించలేకపోయేసరికి నిరుత్సాహపడిపోతారు. 'ఇంక నేనేమీ సాధించలేనేమో' అని నిరాశలో కూరుకుపోతారు.

కాబట్టి పిల్లలు ఏ విషయంలోనైనా ఓడిపోయినప్పుడు తల్లిదండ్రులు వారిని అనునయించాలి. 'ఓటమి చూసి దిగాలుపడితే ఎలా! అదే విజయానికి తొలి మెట్టు' అని తెలియజెప్పాలి. ఒకసారి ఓడిపోయినంత మాత్రాన జీవితమంతా కోల్పోయినట్టు కాదని నచ్చజెప్పాలి. ఓటమిని సానుకూల దృక్పథంతో తీసుకునేట్టు చేయాలి. ఆ ఓటమి నుంచి విజయాన్ని ఎలా సాధించాలో తెలియజేయాలి. దానికి తగ్గట్టుగా శారీరకంగానూ, మానసికంగానూ వారి శక్తిసామర్థ్యాలను పెంచాలి. ఇది తల్లిదండ్రుల బాధ్యత.

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎటువంటి కష్టం రాకుండా చూడాలని అనుకోవడం సహజం. కానీ మనకు కుదిరినంత వరకు కష్టాలు రాకుండా చూస్తాం. అయితే జీవితంలో ఇంకెప్పుడూ కష్టాలు రావని గ్యారెంటీ ఇవ్వలేం కదా! అనుకోకుండా కష్టాలు ఎదురైనప్పుడు వాటిని ఎలా అధిగమించాలో అర్థంకాక వారు సతమతమవుతారు. కాబట్టి చిన్నప్పటి నుంచే వారికి ఎదురయ్యే కష్టనష్టాలను వారే పరిష్కరించుకునే వాతావరణాన్ని కల్పించాలి. అలాగే ఓటమిని ఎలా ఎదుర్కోవాలో నేర్పించాలి. గెలుపోటములను ఒకే విధంగా తీసుకునేట్టు అలవాటు చెయ్యాలి.

తల్లిదండ్రులు తమ జీవితంలో ఎటువంటి ఓటములను ఎదుర్కొన్నారు? అప్పుడు వారు దాన్ని ఏవిధంగా తీసుకున్నారు? దాని ఫలితాలెలా వచ్చాయి? అనే విషయాలు వారికి వివరించడం వల్ల ఎవరి జీవితంలోనైనా ఇవి సహజమని వారంతట వారే తెలుసుకుంటారు. మన ఓటమికి కారణమేంటో తెలుసుకుని ఆ తప్పు మరోసారి జరగకుండా చూసుకోవాలని తెలిసేలా చెప్పాలి. ఓడిపోయామనేది ముఖ్యం కాదు. ఆ తర్వాత మనమేం చేశామనేది ముఖ్యం. దాన్ని వదిలేశామా? విజయం కోసం మళ్లీ ప్రయత్నించామా? అనేది చాలా ముఖ్యం. ఏదైనా పనిచేస్తున్నప్పుడు ఎదురయ్యే కష్టనష్టాల నుంచి, అడ్డంకుల నుంచి పిల్లలు నేర్చుకునేలా, వాటినెదుర్కొని నిలబడేలా వారిని ప్రోత్సహించాలి.

మనం మన పిల్లలకు సైకిల్ తొక్కడం నేర్పించేప్పుడు వారు కింద పడతారు. దెబ్బలు తగులుతాయి. ఏడుస్తారు. అప్పుడు మనం వారిని ఊరుకోబెట్టి గాయాలకు మందు రాస్తాం. మళ్లీ వారిని ప్రోత్సహిస్తాం. అలాగే వారు కూడా ఆ గాయాలను వదిలేసి మళ్లీ సైకిల్ తొక్కడం నేర్చుకోవడంలో పడతారు. అదే విధంగా వారు దేనిలోనైనా ఓటమి పాలైనప్పుడు మనం చాలా ఓపిగా వారికి విషయాన్ని తెలియజేయాలి. జీవితంలో గెలుపోటములు సహజమనే నమ్మకాన్ని వారికి కలిగించాలి.

అంతేకాదు ఈ ప్రపంచంలో తల్లిదండ్రులు లేక, ఉన్నా సరైన సౌకర్యాలు లేక, అనాథశరణాలయాలలో ఉండే తన వయసు పిల్లలు ఎంతో మంది ఉన్నారన్న విషయాలు అప్పుడప్పుడూ తెలియజేయాలి. వీలైతే వారిని కలిసే అవకాశం కల్పించాలి.

అందుకే సునీత తన కొడుకు రాహుల్ బర్త్‌డే రోజు ఒక సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకుంది. రాహుల్ తన ఫ్రెండ్స్‌తో బర్త్‌డే జరుపున్నాక కేకులు, బిస్కెట్లు ఒక బుట్టలో సర్ది కొత్త ప్రదేశానికి తీసుకెళ్లింది.

అక్కడ దాదాపు రాహుల్ వయసున్న పిల్లలే పళ్లేలు చేతిలో పట్టుకుని లైన్‌లో నిల్చున్నారు. ఒక వృద్ధుడు ఆ ఆశ్రమాన్ని నడిపిస్తున్నాడు. ఆయనే ఆ పిల్లలందరికీ అన్నం, పప్పు వడ్డిస్తున్నాడు.

సునీత తాను తీసుకెళ్లిన కేకు, బిస్కెట్లు వాళ్లకు పెట్టసాగింది. మొదట రాహుల్‌కి ఇది నచ్చలేదు. కానీ తరువాత తను కూడా మరో వరుసలో ఉన్న పిల్లలకు పెట్టాడు.

'ఈరోజు రాహుల్ పుట్టిన రోజు' అని ఆ వృద్ధుడు చెప్పగానే పిల్లలందరి మొహంలో చిరునవ్వు కనిపించింది. అందరూ కలిసి రాహుల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్‌కు చాలా సంతోషం కలిగింది. ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియలేదు. కాసేపటికి 'థాంక్యూ' అని చెప్పాడు.

అప్పుడు అనిపించింది ఆ అబ్బాయికి తన జీవితంలో ప్రతి కదలికకు 'థాంక్యూ' చెప్పాలని. తనకు మంచి జీవితం లభించిందని, తను చక్కగా తన పుట్టినరోజుని జరుపుకోగలుగుతున్నాని సంతోషంగా ఉంది. అందుకు తను చాలా కృతజ్ఞుణ్ణని అనుకున్నాడు. కానీ ఈ పిల్లలకు తల్లిదండ్రులెవరో కూడా తెలియదన్న విషయం చాలా బాధనిపించింది. తను ప్రేమానురాగాలు అందించే మంచి కుటుంబంలో పుట్టానని, తనకు మంచి ఆహారం లభిస్తుందని మళ్లీ ఒకసారి గుర్తుకుతెచ్చుకున్నాడు.

అప్పుడప్పుడూ పిల్లలను అలాంటి ప్రదేశాలకు తీసుకువెళ్తే తమ పరిస్థితిని అర్థం చేసుకుంటారు. తమకు కష్టాలెదురైనప్పుడు మరింత ధృడంగా వాటిని ఎదుర్కొంటారు.

మన చిన్నారులు రోజా పూల పరిమళాలను ఆస్వాదించాలని అనుకుంటాం. అయితే అదేసమయంలో వాటి ముళ్లు గుచ్చుకోకుండా ఎలా జాగ్రత్తపడాలో కూడా వారికి నేర్పించాలి. ★

డా॥ మిడియం బాబూరావు,
సిపిఐఎం కార్యవర్గ సభ్యులు,
మాజీ ఎంపి.



ఇదో పాఠ్యగ్రంథం

మొదట నేను జనరల్ పుస్తకాలు చదివేవాణ్ణి. వాటిలో వారపత్రికలు, సీరియల్స్ కూడా వుండేవి. ఎస్ఎఫ్ఐలోకి వచ్చాకే సీరియస్ రీడర్నయ్యాను. రంగనాయకమ్మ, బీనాదేవి నవలలు, రష్యన్ నవలలు చదవడం మొదలెట్టా. రాహుల్ సాంకృత్యాయన్ నవలలన్నీ చదివా. వామపక్ష భావజాలం వంటపట్టిందప్పుడే. పార్టీ పుస్తకాలు చదవడం అలవాటైంది అప్పుడే. ఎమర్జెన్సీ కాలంలోనే ఎక్కువగా పుస్తకాలు చదివే అవకాశం లభించింది. అప్పుడు బయట కార్యక్రమాలేం లేవు. ఆ సమయాన్ని చదువుకోవడానికి ఉపయోగించాను. ఓరోజు కామ్రేడ్ ఎ.రామచంద్రారెడ్డిగారు ఒక పుస్తకం చేతిలో పెట్టి "ఇది చదువు. జీవ పరిణామవాదానికి సమాధానంగా వుంటుంది" అని ఇచ్చారు. ఆ పుస్తకం ఎంగెల్స్ రాసిన **'వానరుడు నరుడైన క్రమంలో శ్రమ పాత్ర'**. అప్పుడు నా వయసు 23. మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతూ... కర్నూలు జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షునిగా వున్నాను. ఆ చిన్న పుస్తకం చదువుతుంటే కొత్త ప్రపంచంలోకి వచ్చిన భావన కలిగింది. అప్పటి వరకు నాలో వున్న సంప్రదాయభావాలన్నీ పటాపంచలయ్యాయి. పైగా ఆ పుస్తకం నాలో భౌతికవాద దృక్పథాన్ని ఏర్పరచింది.

అప్పటివరకూ వ్యక్తి కృషి నామమాత్రమనే భావన వుండేది. వ్యక్తి కృషే సమాజాన్ని మార్చిందని ఈ పుస్తకం తెలిపింది. శ్రమ పట్ల అప్పటివరకు వున్న చులకనభావం పోయి గౌరవం ఏర్పడింది. పైగా చాకిరీ అంటే నిమ్నజాతులవారు చేసేదని అనుకుంటుండేవాణ్ణి. ఆ దురభిప్రాయాలన్నీ పోయి భౌతికవాద దృక్పథం ఏర్పడింది. నిజంగా జీవ పరిణామానికి మూలం మానవ శ్రమా? లేక శ్రమతో సంబంధం లేకుండా దానంతటదే జరిగిందా? అనే సందేహాన్ని ఈ పుస్తకం తీరుస్తుంది.

పైగా నాలో అప్పటివరకూ ఒక దురభిప్రాయం వుండేది. కళ ఏదైనా దైవదత్తమని, దైవకృప వుంటేనే అబ్బుతుందని అనుకుంటుండేవాణ్ణి. ఈ పుస్తకం చదివాక తెలిసింది. ఏదైనా శ్రమవల్లే సాధ్యమౌతుందని.

ఇక పుస్తకంలోకొద్దాం. 1876లో ఫ్రెడరిక్ ఎంగెల్స్ రాసిన అసంపూర్ణ రాత ప్రతి, నన్ను మార్క్సిస్టు భావజాలం వైపు ఆకర్షించిన తొలి పుస్తకం (వ్యాసం) ఇదేనంటే అతిశయోక్తి కాదు. డిగ్రీ వరకూ జీవశాస్త్రం (బయాలజీ) చదివిన నాకు మనిషి భగవంతుడి అద్భుత సృష్టా లేక ప్రకృతి పరిణామ ఫలితమా అనే ప్రశ్న వెంటాడేది. ఈ విషయమై జరిగిన చర్చలు, వాదోపవాదాలు సంతృప్తి ఇవ్వలేదు. ఈ చిన్న పుస్తకం శాస్త్రీయమైన, నిర్ణయాత్మకమైన జవాబు చెప్పింది. శ్రమ (కాయకష్టం) మానవుణ్ణి ఎలా మలిచిందో అతి సాధారణంగా, తేలికగా బోధిస్తుంది. చార్లెస్ డార్విన్ 1858లో ప్రచురించిన 'జీవజాతుల పుట్టుక' గ్రంథంలోని శాస్త్రీయ పరిణామవాద సిద్ధాంతాన్ని గట్టిగా బలపర్చే రచన ఇది.

ఈ పుస్తకంలో తొలి వాక్యం చూడండి. 'యావత్సంపదకు శ్రమే మూలాధారమని రాజకీయ, ఆర్థికవేత్తలు నొక్కి వక్కాణించారు'. ఈ భూమిపై మార్క్సిజం ఆవిర్భావానికి కొన్ని శతాబ్దాల ముందే 'శ్రమ'కు ప్రాధాన్యత, గుర్తింపు లభించింది. శ్రమ దేనినైతే సంపదగా మారుస్తుందో ఆ పదార్థాన్ని ప్రకృతే

పైగా నాలో అప్పటివరకూ ఒక దురభిప్రాయం వుండేది. కళ ఏదైనా దైవదత్తమని, దైవకృప వుంటేనే అబ్బుతుందని అనుకుంటుండేవాణ్ణి. ఈ పుస్తకం చదివాక తెలిసింది. ఏదైనా శ్రమవల్లే సాధ్యమౌతుందని.

ఇక పుస్తకంలోకొద్దాం. 1876లో ఫ్రెడరిక్ ఎంగెల్స్ రాసిన అసంపూర్ణ రాత ప్రతి, నన్ను మార్క్సిస్టు భావజాలం వైపు ఆకర్షించిన తొలి పుస్తకం (వ్యాసం) ఇదేనంటే అతిశయోక్తి కాదు. డిగ్రీ వరకూ జీవశాస్త్రం (బయాలజీ) చదివిన నాకు మనిషి భగవంతుడి అద్భుత సృష్టా లేక ప్రకృతి పరిణామ ఫలితమా అనే ప్రశ్న వెంటాడేది. ఈ విషయమై జరిగిన చర్చలు, వాదోపవాదాలు సంతృప్తి ఇవ్వలేదు. ఈ చిన్న పుస్తకం శాస్త్రీయమైన, నిర్ణయాత్మకమైన జవాబు చెప్పింది. శ్రమ (కాయకష్టం) మానవుణ్ణి ఎలా మలిచిందో అతి సాధారణంగా, తేలికగా బోధిస్తుంది. చార్లెస్ డార్విన్ 1858లో ప్రచురించిన 'జీవజాతుల పుట్టుక' గ్రంథంలోని శాస్త్రీయ పరిణామవాద సిద్ధాంతాన్ని గట్టిగా బలపర్చే రచన ఇది.

సమకూర్చుతుంది.

కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం

జాలరి పగ్గం, సాలెల మగ్గం

శరీర కష్టం స్ఫురింపజేసే

గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి

సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు, శ్రమ జనితాలు

అని మహాకవి శ్రీశ్రీ చెప్పారు.

ఇతరుల చాకిరి (శ్రమ)పై బతికే ధనాఢ్య వర్గాలు తాము అనుభవించే సర్వసంపదలకు రేయింబవళ్లు కష్టజీవుల కాయకష్టమే మూలమని గ్రహిస్తాయా?

వానరులు నరులుగా మారిన పరిణామక్రమాన్ని ఈ పుస్తకం నాలుగు ప్రధాన దశలుగా వివరించింది.

(1) నిటారుగా నిలబడటం

(2) హస్తాభివృద్ధి

(3) భాషాభివృద్ధి

(4) మెదడు అభివృద్ధి

లక్షలాది సంవత్సరాలక్రితం మన పూర్వీకులు (నర వానరులు) నాలుగు కాళ్లతో నడవడం, అవసరం కొద్దీ చెట్లు ఎక్కడం, చదునైన నేలపై వెనుక కాళ్లతో గెంతడం వంటివి పదేపదే చేయాల్సి వచ్చేదని ఛార్లెస్ డార్విన్ వర్ణించారు. అతి శీతలాన్ని, తీవ్రాతి తీవ్రమైన ఉష్ణోగ్రతను తట్టుకుని మనుగడ సాగించగలిగిన నరవానరులుగా ముందుకు సాగారు.

జీవనం కోసం సాగిన పోరాటంలో నివాసయోగ్యంకాని పరిసరాలలో రకరకాల పనుల్లో నిరంతరాయంగా ముందరి కాళ్లు ఉపయోగించాల్సి వచ్చింది. ఫలితంగా ముందు కాళ్లు స్వేచ్ఛను పొందాయి, చేతులుగా మారాయి. ఈ ప్రక్రియ కీలకమైన పరిణామం. 'బొటన వేలు' స్థానం మారింది. ఈ మార్పుల అనంతరమే పరికరాల తయారీ, చిత్రలేఖనం, శిలలపై శిల్పాలు చెక్కడం నరుడికి సాధ్యమైంది.

మనిషి తొలుత సాధించిన విజయాలు వ్యక్తిగతం కాదు, సమిష్టి కృషి ఫలితం, హస్తాభివృద్ధి సహా స్వరపేటిక అభివృద్ధి చెందింది. సైగలతో మొదలైన భావ వ్యక్తీకరణ, ఆటపాటలు, పనిపాటలతో సంక్లిష్టత సంతరించుకుంది. స్వరాంగాల అభివృద్ధితో మాట్లాడే భాష, అనంతరం లిపి రూపు దాల్చాయి.

నరుడికి వానరుడికి మౌలికమైన తేడా ఏమిటంటే పై అభివృద్ధినంతటినీ సమన్వయపరిచే మెదడు 'అభివృద్ధి, డార్విన్ చెప్పిన అభివృద్ధి అన్యోన్య సంబంధ నియమం అమలై మరింత సంక్లిష్టమైన పనులు చేయగల అనుభవాన్ని నరుడు సాధించగలిగాడు.

మనిషి జన్మించింది ప్రకృతిని జయించడానికేగాని దాన్ని అనుకరించడానికి కాదన్న స్వామి వివేకానంద మాటలో ఎంతో వాస్తవం వుంది.

పై నాలుగు దశల అభివృద్ధిక్రమం సమతుల్యంగా సాగింది. సృష్టివాదులు, సాంప్రదాయవాదులు చెపుతున్నట్లు మనిషి సాధించిన విజయాలు దైవదత్తం కాదు. సమిష్టిశ్రమ ఫలితం మాత్రమే.

అత్యంత సంక్లిష్టమైన నృత్యం చేయడం నరుడు నిటారుగా నిలబడకుండా, ఎముకలు, కండరాలు అభివృద్ధి చెందకుండా సాధ్యమా! నటరాజును కొలవటంకన్నా మన పూర్వీకులైన నరవానరులను గుర్తుంచుకోవటం మిన్న.

శిల్పకళ, చిత్రకళ, సాహిత్యం వంటి సామాజిక సమిష్టిశ్రమ జనితాలను మన ముందటి వానరుల గుంపు జీవితంలో సాధ్యమా?

వానరులకు సాధ్యం కాని సంఘజీవనం నరులకు మాత్రమే ప్రత్యేకం. నిప్పు కనిపెట్టడం, చక్రం ఉపయోగించడం మొదలు పారిశ్రామికీకరణకు దోహదపడిన సమాజ పరిణామాన్ని అద్దంలో దూరపు కొండలను చూపినట్లు చూపిస్తుంది ఈ పుస్తకం.

ఏదిఏమైనా ఈ పుస్తకం చదివి అవగాహన చేసుకోవటానికి ఈ కింది అంశాలతో పరిచయం అవసరం.

1. విశేష మేధాసంపన్నుడైన హెన్రీమోర్గన్ కనిపెట్టిన 'రక్త సంబంధీకుల కుటుంబం' ఈ విషయాలను 'కుటుంబం, వ్యక్తిగత ఆస్తి-రాజ్యాంగాల పుట్టుక' అనే గ్రంథంలో ఎంగెల్స్ ప్రస్తావించాడు.

2. ఛార్లెస్ డార్విన్ 'జీవపరిణామవాదం'

3. కారల్‌మార్క్స్ 'అదనపు విలువ సిద్ధాంతం'

ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిందే. సమసమాజం కోరేవారందరికీ ఇదొక పార్శ్యగ్రంథం. ఇప్పటివరకు వైద్యరంగంలో వున్నవారికే కాదు...ఇతరులకు కూడా ఈ పుస్తకం చదవమని చెప్పాను. చెప్తూనే వున్నాను.

★

మొదట నేను జనరల్ పుస్తకాలు చదివేవాణ్ణి. వాటిలో వారపత్రికలు, సీరియల్స్ కూడా వుండేవి. ఎస్ఎఫ్ఐలోకి వచ్చాకే సీరియస్ రీడర్నయ్యాను. రంగనాయకమ్మ, బీనాదేవి నవలలు, రష్యన్ నవలలు చదవడం మొదలెట్టా. రాహుల్ సాంకృత్యాయన్ నవలలన్నీ చదివా. వామపక్ష భావజాలం వంటపట్టిందప్పడే. పార్టీ పుస్తకాలు చదవడం అలవాటైందీ అప్పడే. ఎమర్జెన్సీ కాలంలోనే ఎక్కువగా పుస్తకాలు చదివే అవకాశం లభించింది. అప్పుడు బయట కార్యక్రమాలేం లేవు. ఆ సమయాన్ని చదువుకోవడానికి ఉపయోగించాను. ఓరోజు కామ్రేడ్ ఎ.రామచంద్రారెడ్డిగారు ఒక పుస్తకం చేతిలో పెట్టి "ఇది చదువు. జీవ పరిణామవాదానికి సమాధానంగా వుంటుంది" అని ఇచ్చారు. ఆ పుస్తకం ఎంగెల్స్ రాసిన 'వానరుడు నరుడైన క్రమంలో శ్రమ పాత్ర'. అప్పుడు నా వయసు 23. మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతూ... కర్నూలు జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షునిగా వున్నాను. ఆ చిన్న పుస్తకం చదువుతుంటే కొత్త ప్రపంచంలోకి వచ్చిన భావన కలిగింది. అప్పటి వరకు నాలో వున్న సంప్రదాయభావాలన్నీ పటాపంచలయ్యాయి. పైగా ఆ పుస్తకం నాలో భౌతికవాద దృక్పథాన్ని ఏర్పరచింది.



కవిత్వమ్

ఇక్కడ రాజు...

సి.హెచ్.మధు

ఇక్కడ
రాజెవడో రారాజు ఎవడో కానీ-
నన్ను రాజువు అన్నారు
ఈ ప్రజాస్వామ్యం నీదే ఫో అన్నారు
ఓటువేసే రాజువి నీవే ఫో అన్నారు
తలక్రిందుల ప్రజాస్వామ్యం మాది
ఓటువేసే రాజునా రాయినా
ఏమో కానీ
ఓటు వేసేది నేను
ఓటు పొందేది వాళ్లు
ఇక్కడ గీత గీశారు
ఓట్లు వేసే వారు వేస్తూనేవున్నారు
ఓటు వయసు నుండి కర్ర ఆసరా బ్రతుకు వరకు
నిలబడటానికి యోగ్యత లేదుగా మాకు
పచ్చనోట్లు కట్టలు కట్టలు జీరోవి లేవుగా మాకు

కిందామీద మిదీ కిందా-
మోసాలు వేషాలు లేవుగా మాకు
చట్టాన్ని ధిక్కరించటం చేతకాదుగా మాకు
కులాలను రెచ్చ గొట్టటం
మతాల మంటలు రాజేయటం
ప్రాంతీయ గాలివాటం మాట్లాడటం రాదుగామాకు

ఇక్కడ అబద్ధాలాడే వాడు రాజు
హత్యలు చేసేవాడు రాజు
రక్తాన్ని నంజుకు తినేవాడు రాజు
ఓటు వేసిన వాణ్ణి కాల్చుకు తినేవాడు రాజు
తనను ఎన్నుకున్న వాడు వురిపెట్టుకుంటే
చట్టసభలో చప్పట్లు కొట్టేవాడు రాజు

★

మినీ కవితలు

- రంగనాథ రామచంద్రరావు

నేను గొప్ప ధనవంతుణ్ణి
నేను గొప్ప సాహితీవేత్తను
నేను మహా బలవంతుణ్ణి
నేను మహా మేధావిని
అరే ! ఇదేమిటి?
సముద్రం ముందు నేను?

శత్రుమూకల్ని చంపేశాను
నరహంతకుల్ని చంపేశాను
క్రూర నేరస్థుల్ని చంపేశాను
దేశ ద్రోహుల్ని చంపేశాను
అయితే నరనరాల్లో నెలకొన్న
అవినీతిని?

స్వాతంత్ర్యం వచ్చాక
గాంధీ పోయాడు
నెహ్రూ పోయాడు
పటేల్ పోయాడు
ఆ పై ఎందరో వచ్చారు
అయితే మరో గాంధీ?

నిన్నే ప్రేమించాను
నిన్నే పెళ్లాడాను
నీవు లేకుండా నేను లేను
నీతోటే మరణిస్తాను
అబ్బా! ఈయన శవాన్ని
తొందరగా తీసుకుపోరే ?

పిల్లలు హాస్టల్లో
అమ్మానాన్నలు ఆశ్రమంలో
లాకర్ నిండా డబ్బులు
ఇంటి నిండా వస్తువులు
అయితే మనస్సంతా శ్మశాన మౌనం
మేము మా మా గదుల్లో!

భార్య పోయింది
మరో భార్య వచ్చింది
బిడ్డపోయాడు
మరో బిడ్డ పుట్టాడు
అమ్మ పోయింది
మరో అమ్మ?

నాలోంచి వచ్చాడు
నా పాలు పంచుకున్నాడు
నా ఒడిలో పెరిగాడు
నా చేతిని ఊతం చేసుకున్నాడు
వృద్ధాశ్రమంలో చేర్చి
ఋణం తీర్చుకున్నాడు!

నాడు అనాగరికత
బట్ట చుట్టుకుంది
నేడు నాగరికత
బట్ట విప్పకుంది
ఇంతకీ నాగరికతంటే
దుస్తుల పొడుగు తగ్గటమా?

వ్యభిచారం
నేరమట!
ఎయిడ్స్ నిరోధానికి
కండోమ్ చాలట!
ప్రభుత్వ ద్వంద్వనీతి
భావి యువత అధోగతి!

భిక్షగత్తె చూపు ఆశగా
చేతిలోని నోట్లపైన
పెద్దమనిషి చూపు ఆబగా
ఆచ్ఛాదనలేని గుండెలపైన
పైకి మానవత
మనసులో కుక్క చపలత!

★



హల్వా పూరీలు

కావలసిన పదార్థాలు

బొంబాయి రవ్వ - అరకేజీ, పంచదార - అరకేజీ
నెయ్యి - 50 గ్రా, నూనె - పావుకేజీ
గోధుమపిండి లేక మైదాపిండి - అరకేజీ
యాలకులు - 4, పాలు - 2కప్పులు

తయారుచేసే విధానం

బొంబాయి రవ్వను దోరగా వేయించుకోవాలి. ఒక గిన్నెలో రవ్వకి రెండు వంతుల నీళ్ల పోసి అందులోనే పాలు పోసి కాగిన తర్వాత పంచదార, యాలకుల పొడి, వేయించిపెట్టుకున్న బొంబాయి రవ్వ వేసి వుండలు కట్టకుండా కలపాలి. సన్నని సెగ మీద వుడికించాలి. చివరిలో కొద్దిగా నెయ్యి వేస్తే బాగా కలిపి ఆరనివ్వాలి. మైదాపిండిని పూరీల పిండిలా కలిపి చిన్న వుండలు చేసి పూరీల్లా వత్తుకోవాలి. ఒక పూరీపై హల్వాని పెట్టి దానిపై మరొక పూరీ వేసి చివర్లు అతికినట్లు చేయాలి. ఈ పూరీలను పెనంపై వేసి రెండు వైపులా కొద్దికొద్దిగా నూనెవేస్తూ కాల్చాలి. వీటిని పిల్లలు ఇష్టంగా తింటారు. ఇవి రెండు రోజులు నిల్వ వుంటాయి కూడా.



గోధుమ హల్వా

కావలసిన పదార్థాలు

గోధుమలు - పావుకిలో, బెల్లం - పావుకిలో
యాలకులు - 4, జీడిపప్పు - 10
కిస్‌మిస్ - 10, నెయ్యి లేక డాల్డా - 50గ్రా
మిఠాయి రంగు - అరస్పూన్

తయారు చేసే విధానం

గోధుమలను ఒక రాత్రంతా నానబెట్టి రుబ్బి గోధుమ పాలు తీయాలి. ఈ పాలలో యాలకుల పొడి, మిఠాయి రంగు కలిపి సన్నని సెగమీద అడుగంటకుండా కలుపుతూ వుండాలి. బెల్లాన్ని మెత్తగా కొట్టి కొద్దిగా నీళ్ల పోసి ముదురు పాకం పట్టాలి. అందులో గోధుమ పాలను పోసి ఉండకట్టకుండా, అడుగంటకుండా కలుపుతూ వుండాలి. అంతా ఒక దగ్గరగా వచ్చిన తర్వాత జీడిపప్పు, కిస్‌మిస్, నెయ్యి వేసి కలపాలి. ఒక ప్లేట్‌కి నెయ్యి రాసి అందులో ఈ మిశ్రమాన్ని పోసి సమానంగా చేసి ముక్కలుగా కోసుకోవాలి.

రుచి

గోధుమ లడ్డు

కావలసిన పదార్థాలు

గోధుమలు - అరగ్లాసు
పంచదార - 1 1/2 గ్లాసు
యాలకులు - 4
కిస్‌మిస్ - 10
పాలు - అరగ్లాసు

తయారు చేసే విధానం

గోధుమలను దోరగా అంటే మంచి వాసన వచ్చేవరకు వేయించుకుని పొడి చేసుకోవాలి. ఈ పిండి మరీ మెత్తగా కాకుండా రవ్వలా కాకుండా మధ్యస్తంగా వుండాలి. పంచదారను పొడి చేసుకోవాలి. గోధుమపిండి, పంచదార పొడి, యాలకులపొడిని .... కొద్దికొద్దిగా పాలు పోస్తూ కలిపి లడ్డూలు చేసుకోవాలి. తింటే చాలా రుచిగా వుంటాయి. ఇవి వారం రోజుల వరకు నిల్వ వుంటాయి.





సేమ్యా కేసరి

కావలసిన పదార్థాలు

సేమ్యా - పావుకిలో, పంచదార - పావుకిలో
జీడిపప్పు - 10గ్రా, కిస్‌మిస్ - 10గ్రా
యాలకులు - 4, పచ్చ కర్పూరం - కొంచెం
కుంకుమపువ్వు - కొంచెం
నెయ్యి - పావుకిలో

తయారు చేసే పద్ధతి

సేమ్యా, జీడిపప్పు, కిస్‌మిస్ దేనికది వేరువేరుగా వేయించి వుంచాలి. ఒక పాత్ర తీసుకుని సేమ్యా కొలత ప్రమాణంలో నీళ్ల పోయాలి. నీళ్ల బాగా మరిగిన తర్వాత సేమ్యా వేసి కొద్దిగా వుడకనిచ్చి తర్వాత పంచదార వేసి కలియబెట్టాలి. బాగా వుడికిన తర్వాత జీడిపప్పు, కిస్‌మిస్, పచ్చకర్పూరం, కుంకుమపువ్వు, నెయ్యి వేసి బాగా కలియబెట్టాలి. చేతికి అంటుకోకపోతే బాగా వుడికినట్టు అర్థం. దింపేముందు యాలకుల పొడి జల్లాలి. అంతే! సేమ్యా కేసరి రెడీ!

కథ

మల్లమ్మత్త

- వై. కుసుమకుమారి

"తిండిపెట్టలేం" అని కోడళ్లు చెబుతుంటే ఇద్దరు కొడుకులూ నోరెత్తకుండా నులకమంచాల్లో నిద్ర నటించినపుడే మల్లమ్మ కళ్లలో నీళ్లు కారాయి. రోజూ రైస్‌మిల్లులో నేలపాలయిన బియ్యం చెరిగి బాగు చేసినందుకు ఇచ్చే పాతికరూపాయల భృతి ఆ మిల్లు ఎత్తేయడంతో పోయింది. ఎక్కడికి వెళ్లినా "నువ్వు కాటికి కాళ్లు జాపిన కబోదివి. నీవేం చేయగలవు ఫో" అన్నారు. నెలరోజులుగా పనిలేక ఒకపూట పెడితే మరోపూట లేదంటూ చేసే కోడళ్ల ఈసడింపులను భరించలేకపోయింది. చివరికి ఒక పక్షవాత రోగి కింద పని చేయడానికి కుదిరింది.

పక్షవాతరోగి పెద్దింటామె. ఎడమభాగం పూర్తిగా చచ్చుపడిపోయింది. అన్నీ మంచం మీదే. ఓపిగ్గా ఆమెకు అన్ని పనులూ చేసి, వారు పెట్టింది తింటూ కాలక్షేపం చేసింది దెబ్బయ్యేళ్ల మల్లమ్మ.

అక్కడ కూడా మనస్సులేని కోడలుంది. అత్తంటే మండిపడుతోంది. "ఎన్నాళ్లో ఏమిటో ఈ దరిద్రం. ముసలిపీనుగు నోరు కట్టదు. ఆ కూతుళ్లు వచ్చేసి అమ్మా ఇది తినే అది తినే అని నానాగడ్డి పెడితే మిల్లు ఆడినట్టు నోరు ఆడిస్తోంది. ఎలాగోలా చేయి, కాలు వచ్చేస్తే పెద్దరికం చేద్దామని, మమ్మల్ని వేపుకుతిందామని చూస్తోంది. దేవుడికి తెలుసు. కొట్టిపడేసినట్టు పడేశాడు" అని రోగిముందే పెళపెళ మాట్లాడుతుంటే పాపమా పెద్దావిడ కళ్ల నిండా నీళ్లు నింపుకుంటోంది.

మల్లమ్మకు కూడా ఆమెకింద చేయడానికి బొత్తిగా ఇష్టంలేకున్నా ఆమెను కోడలు మానసికంగా హింసిస్తున్న తీరును తట్టుకోలేక పోయింది. ఆమెపట్ల జాలిపడి మరింతగా సేవలు అందించింది. ఆమెను పలుమార్లు ఓదార్చింది.

మల్లమ్మకు ఉన్నంతలో పెద్దింటి కోడలు తిండి బాగానే పెడుతోంది.ఎందుకంటే ఆ ముసల్ది వెళ్లిపోతే ఇక తానే చేయాలని భయంతో జాగ్రత్తగా చూసుకోసాగింది.

మల్లమ్మను దురదృష్టం వెంటాడింది. పక్షవాతరోగి సడన్‌గా మరణించింది. ఆ రోజే ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చేసి పంపేశారు. తిన్నగా కొడుకుల వద్దకు వెళ్లింది. చూడగానే మండిపడ్డారు కోడళ్లు.

"బావుంది మల్లమ్మత్తా .... నీకు చీడో పీడో పట్టుకుంది. లేకుంటే నీపుణ్యాన బంగారంలాంటి రైస్‌మిల్లు ఎత్తేశారు. పక్షవాతరోగం వచ్చిన ఆపెద్దింటావిడ కనీసం రెండేళ్లు మంచంమీద లేకుండా రెండునెలలకే గుటుక్కుమంది. అలాంటి ఏ జబ్బు ఇల్లో చూసుకోకుండా మళ్లీ వచ్చావా" అని నిలదీసింది పెద్దకోడలు.

"అవునక్కా పిల్లాపాపలతో ఉన్నాం. చీడపీడలు వేగిరం అంటుకుంటాయి. మంచి అంటదు. ఈ ముసల్ది ఆ జబ్బుదానికింద చేసి వచ్చింది. ఎన్ని రోగాలు తెచ్చి మనకు అంటిస్తుందో. నాకు భయంగా ఉంది" అని మూతి తిప్పింది.

"నాకు వారు వెయ్యిరూపాయలు ఇచ్చారు" అని కోడళ్లకు అందించింది మల్లమ్మ.

ఆ నోట్లు ఇద్దరూ పంచేసుకుని అత్తను ఎగాదిగా చూసి "సరే అత్తవయ్యావు తప్పదు. వెళ్లి కోనేట్లో తలారా మునిగేసి నీతో తెచ్చిన రోగాలను కడిగేసుకో" అని చెప్పి లోపలికి వెళ్లిపోయారు.

మల్లమ్మకు మనస్సు చివుక్కుమంది. అక్కడే ఉన్న కొడుకులను చూసింది. వారు ఏమీపట్టనట్టున్నారు.

కోనేట్లో స్నానంచేసి తిన్నగా ఇంటికి వెళ్లింది.

"ఇదిగో అత్తమ్మా నీకు చెప్పాలి. నువ్వు పెద్దింటోళ్ల ఇంట్లో నెలరోజులు తినివచ్చావు. నీ ముఖంచూసి ఎవరూ పెట్టడానికి ఇష్టపడకున్నా వారి పని నీవు చేసి తగలడ్డావు. నువ్వెక్కడ జారిపోతావోనని ఇంతముద్ద, దాంతో బాటు మాంచి కూరలు పడేసి ఉంటారు. నువ్వు మామూలు రైతు కూలీల తల్లివి కావు. రుచులు తిన్న పెద్దింటి పనిదానివి. నీకు మాత్రం ఇంత కూర వండిపోయడానికి మాకు నువ్వు మిద్దెలు, మేడలు ఇచ్చిన పాపాన పోలేదు" అని ఇంత ముద్ద పడేశారు.

మల్లమ్మ మౌనంగా తిని ఆరుబయట నులకమంచంలో ముడుచుకుని పడుకుంది. ఆమెకు నిద్రపట్టేసింది.

రాత్రి అయ్యింది. మెల్లగాలేచి గోళెంలోని నీళ్లతో ముఖం కడుక్కుని కోడళ్లకోసం చూసింది. ఇద్దరు కోడళ్లు ఇంట్లో బ్లాక్‌అండ్‌వైట్ టీవీలో సీరియల్ చూస్తూ "చ్చు చ్చు చ్చు" అని బాధపడిపోతున్నారు.

మెల్లగా వెళ్లి టీవీలో ఏమవుతుందోనని చూసింది.

మల్లమ్మ గతుక్కుమంది. 'అత్తా ఒకింటి కోడలే' అనే సీరియల్ చూస్తున్నారు. అత్తను కోడళ్లు రాచిరంపాన పెడుతున్న దృశ్యం చూడలేకపోతున్నారు తన కోడళ్లు. అందుకే "చ్చు చ్చు చ్చు" అని అంటున్నారు. మల్లమ్మకు చాలా ఆశ్చర్యమేసింది. నమ్మలేకపోయింది. తెరమీద కదలాడే చిత్రంలో చూసి అత్తను హింసించడం తట్టుకోలేని వారు తనపట్ల ఎందుకిలా దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని బాధపడుతూ అక్కడే కూర్చుంది.

అప్పుడు అత్తను చూశారిద్దరు కోడళ్లు.

"ఏంటత్తమ్మా నువ్వు నిన్నటివరకూ రంగుల్లో చూసుకునే దానివి. మరి ఇక్కడ ఎలిసిపోయిన తెలుపునలుపు టీవీపెట్టెలో ఇంతకు మించి రంగు నీ కంటికి ఆనదు. ఇక సీరియళ్లు మరిగినావంటే ఆ సీరియల్ ఎయ్యి. ఈ సీరియల్ కథేంటి? అని మమ్మల్ని తినేస్తావు. అందుకే టీవీ ఉన్న కాడికి రాకు. నీతో పడలేం" అని ఒకకోడలు లొడ లొడ పేలింది.

ఆ మరుసటిరోజు మల్లమ్మను వెతుక్కుంటూ ఆ పెద్దింటి చుట్టం ఒకడు వచ్చాడు. "ఏమ్మా నువ్వేనా

పక్షవాతరోగం వచ్చినామెను కంటికిరెప్పలా చూసుకున్నావట. ఆ యమ్మకు సేవసేసుకునే భాగ్యం మాకు లేకపోయింది. ఆమె చేతితో తిన్నాం. ఇంతవారమయ్యాం. ఇక నీ వంటివారు ఈ రోజుల్లో అరుదే. ఎవరు ఎవరికింద ఎంతిచ్చినా చేయరు. ఇక్కడికి పాతిక కిలోమీటర్ల దూరంలో చింతపల్లి ఉంది. అక్కడికి వచ్చేయరాదు. నీకు ముప్పూటా గడిచిపోతుంది. ఇక్కడలా మనిషి 'సేవకాదు, దేవుడిసేవ' అని చెప్పాడు. మల్లమ్మ వివరాలు తర్కిస్తుండగా కోడళ్ళ "మారాజులా వచ్చి చేసుకుంటుంది. ఇక్కడా ఆ ముద్దే అక్కడా ఆ ముద్దే" అని అతడిని సాగనంపారు. మల్లమ్మ వేదాంతిలా నవ్వి కొడుకుల తలలు నిమిరి బయల్దేరిపోయింది.

♦♦♦

చింతపల్లి కొండపక్క గ్రామం. అక్కడ సర్పంచ్ కొండయ్య బాగా ఉన్నోడు. పొలిటికల్‌గా బాగా ఎదిగాడు. పెద్ద ఇల్లు, మంది మార్బలంతో ఉన్నాడు. మల్లమ్మను చూడగానే "రాతల్లీ నీ గురించి విన్నాను. నిన్ను నీ పిల్లల్ని వదిలి నీ పెనిమిటి దేశాలు పట్టిపోయాడట. ఆ ఇద్దరి పిల్లలకోసం నీవు పదరానిపాట్లు పడి పెంచి పెద్దోళ్లను చేసి ఓ ఇంట్లోళ్లను చేస్తివట. పాపం ఆ వచ్చిన కోడళ్లిద్దరూ నీ ముఖం చూడరైతిరని తెలిసి లోకం ఇట్టా ఏడుస్తుందని అనుకున్నాం. అన్నట్టు మాసుట్టపుదానికి సేవలు చేస్తివట. ఇప్పుడు మాకాడ పని ఏమిటి అంటే ఊరు అమ్మోరుకు ఒక అయ్యోరుండేవాడు. ఆడు ఆ మధ్య సచ్చిపోనాక అమ్మోరు చెట్టుకాడ దీపం పెట్టడానికి ఎవరూ దొరుకుతలేరు. మనిసికే చేసావు. అమ్మోరుకి సేయవా అని రప్పించాను"

ఆ మాటలకు మల్లమ్మ తలాడించింది.

"ఊరు సివర్లో వేపచెట్టుండాది. అక్కడ అమ్మోరుకు మంగళారం పూట నువ్వు దీపం పెట్టేస్తే ఊరి ఆడాళ్లంతా వస్తారు ఎంతో కొంతిస్తారు. కోళ్లుఏస్తే నీకు దానిపీక ఇస్తారు. అయితే చిన్న సాకుతో కోడిపీక పరపరా కోసేయాలి. అంతేగాని లోగడ ఉన్న అయ్యోరులా నోటితో కోడిని సీరీకూడదు. పొట్టేల్లు ఏసుకున్నోల్లు దాన్ని నరికినోళ్లను తెచ్చుకుంటారు. ఇది నీడూటీ. అన్నట్టు నీకు దండకం పోయిడం వచ్చా?"

"నాకు తెలిసినదే అమ్మోరి దండకం."

"నీవు ముప్పూటలా ఈడకొస్తివనుకో నీకు లోపల అమ్మగారుండాది. దానిసెయ్యి పెద్దది. నీ ఒక్కదానికి పెట్టమంటే ఇద్దరికి సరి పడా పడేస్తాది" అని గలగలా నవ్వాడు.

ఆ మరుసటిరోజు మల్లమ్మ తూరుపు తెల్లారకుండానే చెరువులో మునిగేసి అలానే తడిబట్టలతో వేపచెట్టువద్ద దీపం పెట్టుకుని కూర్చుంది. అమ్మలక్కలు వచ్చి సంతోషపడిపోయారు. మల్లమ్మ నుదుట పెద్ద కుంకుమబొట్టుతో కళకళలాడింది. అలా సాయంత్రానికి రెండువందల రూపాయలు పైగా వచ్చింది. ఓ పది కోడిపీకలు వచ్చాయి. వల్లకాటి చెరువుకు పక్కనే అయ్యవార్లు ఉండే గుడిసెను మల్లమ్మకు ఇచ్చారు. గుడిసెలో కోడిపీకల కూర వండుకుంది. ఊళ్లో ఎవరికి మసూచి వచ్చినా మల్లమ్మ వెళ్లి దండకం పోసేది. వారు భత్యాలతో బాటు పచ్చనోట్లు ఇచ్చేవారు. ఇలా ఆరుమాసాలు అయ్యింది. ఆమెవద్ద ఆరేడు వేలు చేరాయి. ఊరి జనాలు ఆమెలో సాక్షాత్తు అమ్మోరిని చూసుకుని సాకసాగారు.

చేతిలో డబ్బు ఇంట్లో బస్తా బియ్యం చేరేసరికి కొడుకులు గుర్తుకువచ్చారు. అమాయకులు ఎలా బతుకుతున్నారో అని కార్డు రాయించింది. వారు రాలేదు. చూసిచూసి కళ్లుకాయలు కాశాయి. చూడడానికి రమ్మంటే రార్రైరి. అప్పటికి ఆమెకు అర్థమైంది. ఈసారి తనవద్ద బస్తాకుపైగా బియ్యం, పండుగ ఖర్చులకు సరిపడా డబ్బు ఉన్నాయిని కార్డు వేయించింది. మూడోరోజు ఇద్దరుకొడుకులూ కోడళ్లతో దిగారు.

కోడళ్లు అత్తను పట్టుకుని ఏడ్చేశారు.

"నీ ఎడల మేము చేసింది తప్పే అయినా ఇలా అమ్మోరు సేవ నీకు దొరికేది కాదు. నీవు ఇక్కడ దేవుడమ్మ అయితివి. నాలుగురాళ్ల సంపాయిస్తివి. అదే నీకు ఉన్నదానిలో ఇంతపడేసి ఉంటే ఇక్కడికి రావు అనకూడదు. అంతా ముద్దకు వాచిపోయేవాళ్లం" అని తాముచేసింది రైటే అన్నట్టు చెప్పుకున్నారు.

మల్లమ్మ సన్నగా నవ్వేసింది.

కొడుకుల చేతుల్లో తనుదాచిన వేలరూపాయలు పెట్టేసింది.

కోడళ్లకు గ్రామీణులు ఇచ్చిన బియ్యం, పప్పులు అమ్మోరుకు భక్తులు చూపించే చీరలు, జాకెట్ గుడ్డలు మూటకట్టి ఇచ్చింది. అవి చూసి పొంగిపోయారు.

రెండురోజులు మల్లమ్మ వారిని తనవద్దే ఉంచుకుంది. వారికి వండిపెట్టి సంతోషపడింది మల్లమ్మ. మంగళవారం రానేవచ్చింది. కోడళ్లను తీసుకుని వేపచెట్టు కింద కూర్చుంది. అక్కడ మల్లమ్మకు ఆడాళ్లు కాళ్లకు దండం పెట్టడం చూసి కోడళ్లిద్దరూ అయోమయంలో పడ్డారు. "పక్షవాతరోగికి అన్నీ ఎత్తిపోసిన దానికి ఎంత అదృష్టం వచ్చిపడింది" అని మూతులు కొరుక్కున్నారు.

ఆ తరువాత నెలకొకసారి మల్లమ్మ వద్దకు కోడళ్లు వచ్చి ఎప్పటికప్పుడు బియ్యం, చీరలు తీసుకుపోతుండేవారు. ఇలా కొన్నాళ్లు సాగింది. మల్లమ్మకు రోగమొచ్చి మంచం పట్టింది. అప్పుడు కోడళ్లు వచ్చారు. మూసిన కన్ను తెరవకుండా నిద్రలో జోగింది. ఊళ్లో సంచి డాక్టర్ వచ్చి "రెండు పొట్లాలు భస్మం ఇచ్చి ఒకపొట్లం నోట్లోకి మరో పొట్లం నుదుటిమీద రాస్తే సరిపోద్ది. అప్పటికి తగ్గకుంటే సర్కార్ దవాఖానాకు తీస్కుపోండి" అని చెప్పాడు. కోడళ్లు ఇద్దరు చిన్నపాటి కుట్రచేశారు. ఈ ముసల్ది ఈరోజు కాకపోతే రేపయినా హరీమంటుంది. దీని వారసత్వంగా వేపచెట్టుకు దీపం మనమే పెట్టాలి. అందుకోసం అత్త రోగంతో చావాలి అని అనుకున్నారు. ఏ మందూ మాకు ఇవ్వకుండానే మంచం మీద వదిలేశారు.

కోడళ్లు ఆ వారం వేపచెట్టువద్ద దీపం పెట్టి కూర్చున్నారు. ఊళ్లో జనాలు వచ్చి మొక్కుకుని వెళ్లారు. అక్కడికి వచ్చిన కొండయ్య "ఏమ్మా గుడిసెలో ఒక్కామెను వదిలేసి ఇద్దరూ ఇక్కడే ఉన్నారు. పట్టణంలో వైద్యం చేయిస్తిరికారు. ఎలా ఉంది?" అని అడిగాడు. మల్లమ్మకు తగ్గని రోగంపై అక్కడికి వచ్చిన అమ్మలక్కలు జాలిగా స్పందించారు.

మల్లమ్మ కొడుకుల్లో ఒకడు పరుగెత్తుకుని వచ్చి "అమ్మను చూద్దామని ఇప్పుడే ఇద్దరన్నదమ్ములం బస్సుదిగి గుడిసెకెళ్లాం. అవునే ఇద్దరూ ఇక్కడ ఉండిపోయారు. అక్కడ మాయమ్మ కర్రకట్టేసింది. ఏ రాత్రిమీదో సచ్చిపోయినట్టుంది మీరు తెల్లారగట్ల చూడలేదా?" అని చిరుకోపాన్ని ప్రదర్శించాడు.

ఆమాటలకు అక్కడున్న గ్రామీణులు ముక్కున వేలేసుకున్నారు. ఎర్రంగుచీరలతో నుదుటి మీద కోడిగుడ్డంత కుంకుమతో వారికి అంతవరకూ దేవుడమ్మల్లా కన్పించిన ఆ ఇద్దరూ మల్లమ్మను ఏవిధంగా చూసుకున్నారో బట్టబయలు అయ్యాక భూతాల్లా కన్పించారు. "ఏమి కోడళ్లో ఏమిటో. పాపం! మల్లమ్మ అంత ముసలరికంలో కూడా కొడుకులూ, కోడళ్లూ అంది. ఈ కోడళ్లు ఏమిటామ్మ ఇంత చుప్పనాతులు" అని ముఖంమీద అనేసి అంతా వెళ్లిపోయారు.

కొండయ్య పక్కనే ఉన్న అనుచరులు అయ్యా మల్లమ్మ వచ్చాక వేపచెట్టుకాడకు రావడాలు, కోళ్లు కోయడాలు ఎక్కువయ్యాయి. ఆమె మంచిది. మరి అలాంటామె మనకి దొరకదు" అని ఒకడు విచారవదనంతో చెప్పాడు. అంతా వంత పాడారు.

కోడళ్లు ఇద్దరూ ఆశగా కొండయ్యవైపు చూశారు. వాళ్లవైపు హీనంగా చూస్తూ "మన మిల్ట్రీవోడి తల్లికి వేపచెట్టును అప్పగిద్దాం" అని చెప్పి వెళ్లిపోయాడు. కోడళ్లు బిక్కముఖాలు వేశారు.

★

చూద్దామా







అబ్బురపరిచే బెలుం గుహలు

బెలుం గుహలను చూడాలంటే కూసింత గుండెధైర్యం వుండాల్సిందే. గుహాల లోపలికి లోలోపలికి వెళుతూ వుంటే ... అదో ప్రపంచం. ఆ కొత్త ప్రపంచంలో మనమూ లీనమైపోతాం. ప్రతి అంగుళం వింతగా, కొత్తగా వుంటుంది. మున్ముందుకు వెళుతూ వుంటే ఆశ్చర్యం...ఆనందం...భయం...ఉద్వేగం...అన్నీ మనల్ని ముంచేస్తాయి. ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. తీరా అంతా చూసి బయటికొచ్చాక...ఓ సుదీర్ఘ నిట్టూర్పు విడుస్తాం. ఆ అరుదైన జ్ఞాపకాలను మదిలో భద్రపరచుకుంటాం. మరి ఆ వివరాలేంటో ఈ వారం చూద్దామా...

-పానుగంటి చంద్రయ్య

బెలుం గుహలను చూసేందుకు రోజుకు 400 నుండి 500 మంది దాకా వస్తుంటారు. సెలవురోజుల్లో అయితే ఇంకా ఎక్కువగా వస్తుంటారు. ఇటీవల ప్రజాశక్తి సిబ్బంది అంతా కుటుంబసభ్యులతో కలిసి విహార యాత్రకు వెళ్లాం. భూమి పైభాగంలో గుహల దగ్గరకు రాగానే ధ్యానంలో ఉన్న 50 అడుగుల బుద్ధుని విగ్రహం కనబడింది. బుకింగు ఆఫీసు, క్యాంటీన్ వగైరాలున్నాయి. గుహలోకి వెళ్లగానే మొదట సింహద్వారం, ధ్యాన మందిరం. దాటి వెళ్తుండగా... ఒక మహిళను ఎత్తుకుని మాకు ఎదురుగా వస్తున్నారు. ఆమెకు దాదాపు 30 ఏళు ంటాయి. ఏంటని అడిగితే ఉదయం టిఫిన్ చేయలేదు. లోపలికెళ్లాక నీరసపడిపోయిందని చెప్పారు. ఆ పరిస్థితి చూడగానే కొందరు గుహలలోకి రాకుండా వెనుదిరిగారు. నాక్కూడా వెనక్కి వెళ్లాలనిపించింది. అప్పటికీ మాతో వచ్చిన గైడ్ చెబుతూనే ఉన్నాడు. “ఏమీ కాదు. చివరిదాకా ఎలాంటి బ్రీతింగు సమస్యా రాదు. నేనున్నానుగా నాతో రండి” అని అన్నారు. అయినా కొందరు భయపడ్డారు. మా సిబ్బందిలో కూడా కొందరు వెనుదిరిగారు. లోపలికి వెళ్లేకొద్దీ చెమటలు పడుతున్నాయి. మధ్యమధ్యలో వెంటిలేటర్ల ద్వారా గాలి వస్తుంది. అక్కడ అందరూ గుమిగూడుతుంటారు. గైడ్ చెప్పేవి సక్రమంగా వినడం లేదు. వేయిపడగలు...మండపం.. మర్రిఊడలు... .దాటాం... అక్కడ మాపెద్దబ్బాయి గౌతమ్ “డాడీ మర్రి ఊడలు ఉన్న దారిలో లోపలికి వెళ్దాం” అన్నాడు. అక్కడికి ఎవ్వరూ వెళ్లడంలేదురా. అందరూ వెళ్లే దారిలో వెళ్దామని చెప్పాను. మా మూడో అబ్బాయి చంటి ఏడుస్తున్నాడు. చెమటలు పడుతుంటే కొంత భయపడినట్లున్నాడు. నేను భుజానికెత్తుకుని ఏమీ కాదని సమాధాన పరిచాను.. కొందరు చంటి బిడ్డలను కూడా వెంటతెచ్చుకున్నారు. హాపీగా ఫాలో అవుతున్నారు. ఇలా ఒక్కోటీ దాటుకుంటూ లోపలికి వెళ్తున్నాం. మాయా మందిరం...కోటి లింగాలు...చివరగా పాతాళ గంగ....కొన్నిచోట్ల ఒక్కో మనిషి మాత్రమే నడిచే దారుంది. అక్కడ కొంచెం భయమనిపిస్తోంది. గుహలలో రాతి పొరలు కనబడతాయి. వాటిని చూస్తుంటే భూగర్భ జలం ఎంత అడుగంటి పోయిందో అర్థమవుతుంది. పాతాళ గంగ దాకా వెళ్లాక మా చంటి మరింత భయపడసాగాడు. దీంతో తొందరగా బయటికి వెళ్లాలనిపించింది. గైడును అడిగాను ‘షార్టుకట్ రూటేదయినా ఉందా అని’ లేదని చెప్పాడు. వచ్చిన దారినే వెళ్లాలని చెప్పాడు. అక్కడ దాహమేసింది. పాతాళగంగలో నీళ్లు తాగవచ్చా అని గైడ్‌ను అడిగాం... “అవి బ్యాక్టీరియా ఎక్కువగా ఉండే నీరు. ఏమైనా అవుతుంది. గొంతు పట్టేయడం లేదా మోషన్స్ కావచ్చు. తప్పదంటే తాగండి” అని చెప్పాడు. అక్కడే ఒక అమ్మాయి చేతిలో వాటర్ బాటిల్ కనిపించింది. అడగ్గానే ఇచ్చింది. నేనూ మాచంటి తాగాం. డాడీ నీళ్లన్నాడు.. మా రెండో వాడు ఆదిత్య. వాడికి కూడా తాపాను. తిరిగి బయటికి వచ్చే వారందరికీ చెమటలు పట్టాయి. మరోపక్క ఎదురుగా వచ్చే వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. ఆరోజు ఆదివారం కావడం వల్ల ఎక్కువగానే ఉన్నారు. సింహద్వారం దాకా వచ్చాక కాసేపు కూర్చున్నాం. అప్పుడు గైడ్‌ను మరిన్ని వివరాలడిగాను. “మనం 120 ఫీట్ల లోతుకు వెళ్లి బయటికి వచ్చాం” అన్నాడు. అంటే దాదాపు పదంస్తుల భవనం అంత అని ఊహించుకున్నాను. 140 ఫీట్ల లోతుకు ఆక్సిజన్ పుష్కలంగా ఉంటుంది. వృద్ధులు కూడా లోపలికి వెళ్లి రావచ్చని గైడ్ చెప్పారు. లోబిపి లేదా ఆస్తమా ఉన్న వారు వెళితే కొంత సమస్య అవుతుంది. అటువంటి వారు ముందే చెబితే ఆక్సీ కేర్ పెడతారు. వారికి ఊపిరి తీసుకునే సమస్య రాదన్నాడు. లోపల ఏమైనా అవుతుందేమో అనే ఫీలింగు మనుసులో ఉన్నవాళ్లు భయపడతారు తప్ప

ఎవ్వరికీ ఏమీ కాదని చెప్పాడు. సింహద్వారం నుండి పాతాళగంగ వరకు పెట్టిన పేర్లు పర్యాటక శాఖ ఆధీనంలోకి వచ్చాక పెట్టినవే..... మూడు కిలో మీటర్ల భూగర్భ జలం తగ్గిపోయాక సహజంగా గుహలు ఏర్పడ్డాయి. ...అయితే కిలోమీటరున్నర మాత్రమే వెళ్లగలుగుతున్నాం... ఇంకా లోపలికి వెళ్లడానికి దారి బాగోలేదు. ఆ తరువాత కొంత లోపలికి వెళ్లడానికి దారి ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎక్కువగా మనుషులు తయారు చేసినవే ఉన్నాయి. యంత్రాల వినియోగం చాలా తక్కువ. ఇటీవల బెంగుళూరు, జమ్ముకాశ్మీర్, స్విట్జర్లాండు వాళ్ల దీనిపై కొంత పరిశోధన చేస్తున్నారు. ఆక్సిజన్ లోపలికి ఎలా వెళ్తుందో....టెంపరేచర్ ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి కొన్ని పరికరాలను అమర్చారు.

ప్రపంచంలోనే నెంబర్ 2

బెలుం గుహలు

ప్రపంచం మొత్తంలోకి భూమిలోపల గుహలున్న ప్రదేశాలను వేళ్లమీద లెక్కించవచ్చు. అందులో నెంబర్ 2గా బెలుం గుహలను చెప్పుకోవచ్చు. స్పెయిన్‌దేశంలో 10 కిలోమీటర్ల పొడవునా గుహలున్నాయి. ఆ తరువాత ఇక్కడే ఉన్నాయి. ఇవి 3.5 కిలోమీటర్ల పొడవుంటాయి. మేఘాలయలో కూడా కేవ్స్ ఉన్నాయి. కాని అవి కొండల్లో ఉన్నాయి. వైజాగ్‌లో బొర్రా కేవ్స్ ఉన్నాయి. అవికూడా కొండల్లో ఉన్నాయి. భూగర్భంలో సహజంగా ఏర్పడిన మొదటి గుహలు మాత్రం బెలుంలోనే ఉన్నాయి.

గుహలు దేవతలకు దేవుళ్లకు నివాసమనే నమ్మకం వల్ల అవి పవిత్ర స్థలాలుగా చలామణి అవుతున్నాయి. గుహలు కొండ చెరియలలోనూ అడవులలోనూ ఎక్కువగా కన్పిస్తూ ప్రకృతి నిలయాలై విరాజిల్లుతుంటాయి. పురాతన కాలంలో ఈ గుహల్ని ప్రాచీన మానవుడు నివాసాలుగా ఉపయోగించుకున్నాడు. ఇంతటి ప్రాచుర్యం పొందిన ఈ గుహల గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది కదా.......

బెలుం గుహల కథాకమామిషు ....

క్రీ.పూ.4500 నాటి మట్టి పాత్రలు ఈ గుహలలో దొరకటం విశేషం. జైనమునులు వుండేవారని శంకరాచార్యులు చెప్పారు. 1884లో హె.బి. ఫూటె అనే ఆంగ్లేయుడు మొదటిసారిగా వీటి ఉనికిని చాటి, కొంత వరకు కొలిచాడు. 1982-83, 83-84 శీతాకాలాల్లో జర్మనీకి చెందిన గుహాన్వేషకుడు, హెచ్.డి.గేబర్ ఆయన సహచరులతో ఈ గుహ సొరంగాలను మూడు కిలోమీటర్ల 225 మీటర్లు పరిశోధించి పటాన్ని తయారు చేశారు. 1988 ఆంధ్రప్రదేశ్ పురాతత్వ శాఖవారు ఈ ప్రదేశాన్ని రక్షిత స్థలంగా ప్రకటించి కొన్నేళ్లపాటు కాపలాదారుని కూడా నియమించారు. ఆంధ్రప్రదేశ్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటానికి వాటి పోషణ భారాన్ని తమ పరిధిలోకి తీసుకొన్నారు. సొరంగ మార్గాల గుండా మట్టి దిబ్బలు తొలగించి నాపరాళ్లు పరిచి ఒకటిన్నర (1 1/2) కిలో మీటర్ పొడవునా నడక దారి తయారు చేశారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సొరంగాల చివరి ప్రదేశాలలో గాలిని లోపలకు పంపే పంకాలు ఏర్పాటు చేశారు. ఉపరి తలం నుంచి 10 మీటర్ల లోతులో మొదలై 30 మీటర్ల వరకు ఉన్న ఈ సొరంగాలు (120 అడుగుల లోతున) కొన్ని చోట్ల విశాలంగానూ కొన్నిచోట్ల ఇరుకుగానూ వివిధ ఆకృతులు కలిగిన స్ఫటికాకారం స్టాలెగ్ మైట్లు, నీటి మడుగులు, గజిబిజిగా ఉన్న పక్క సొరంగాలు చూడడానికెంతో ఇంపుగా వుంటాయి. పర్యాటకులనెంతగానో అకట్టుకొంటున్నాయి. ఈ గుహాన్వేషణలో పాల్గొన్న డానియల్ గేబర్, ఆయన సహచరులకు స్థానిక రిటైర్డ్ ఎస్.పి బి.చలపతిరెడ్డి, ఆయన అల్లుడు కీర్తిశేషులు పి.రామసుబ్బారెడ్డి, రిటైర్డ్ హైస్కూలు హెడ్‌మాస్టర్, రామస్వామిరెడ్డి, వెంకటరమణ, పద్మనాభయ్య సహకరించారు. ఈ గుహలు పర్యాటక శాఖ ఆధ్వర్యంలోకి రావడానికి రిటైర్డ్ అడిషనల్ ఎస్.పి ఎం.నారాయణరెడ్డి కృషిచేశారు. నల్లరేగడి నేలలో పంట పొలాల నడుమ సేద్యానికి అనువుగాని 90 సెంట్ల రాతి ప్రదేశంలో చేదుడు బావిలాంటి మూడు రంధ్రాలు 10 మీటర్ల లోతున ఉన్నాయి. ఒకటి అడుగు పూడి పోయింది. నడుమనున్న దాని గుండా దిగటానికి మెట్లు కట్టారు. అడుగు నుండి నేలకు సమాంతరంగా పొడవైన విశాలమైన సొరంగ మార్గం ఉంది. లోపల కొంత దూరం పోయిన తర్వాత ఇది మూడు భాగాలుగా చీలి పోయింది. ఒకటి ఓ చిన్న గదికి, ఒకటి మండపానికి, ఒకటి పాతాళ గంగ అనే నీటి మడుగుకి దారితీస్తాయి. పాతాళ గంగ దగ్గరే వేలాడే స్ఫటికాకృతులు కనిపిస్తాయి. విద్యుద్దీపకాంతిలో ఈ సొరంగాల సోయగాలను తిలకిస్తూ పయనిస్తూ ఉంటే వేరే ప్రపంచంలో ఉన్నట్లనిపిస్తుంది. భూగర్భంలో దాగి ఉన్న ఊహాతీతమైన ప్రకృతి ప్రసాదమే అనుకోవాలి. ఇవన్నీ సందర్శకులను మైమరిపిస్తూ ఉంటాయి.

చారిత్రాత్మక బావి

ఊరిచివర శివాలయం పక్కన, నిటారుదారులు కలిగిన రాతి బావి దర్శనమిస్తుంది. అది దిగుడు బావి. దానికి ఒకవైపు మెట్లున్నాయి. నిజానికది బావి కాదు. ఒక నిటారు గుహ వర్షాకాలంలో నీరు నిండి ప్రవహిస్తుంది. వేసవిలో నీరు ఇంకిపోతుంది. కరువు కాలంలో అడుగున పక్కకు గల సొరంగంలో నీరు నిలుస్తుంది. ఇదే గ్రామస్తులందరికీ నీటి వనరు. 1946లో మొదటిసారి గ్రామ మునసబు బి.మల్లారెడ్డి బావి పటం గీశారు. బెలుం గుహలలో చేరే నీటిని బట్టి చాలా తక్కువ ఎత్తులో గల ఈ బావి నీటి మట్టం ఉంటుంది. 30 కిలో మీటర్లలో ఉన్న పెన్నానది నీటి మట్టం కూడా దీనిపై ప్రభావం చూపుతుందంటారు. ఇది నిండినప్పుడు శివాలయంలోని శివలింగం కింది నుంచి నీరు ఉబికి పారుతుంది. బెలుం గుహలు భూగర్భంలో ఏర్పాటు కావటం ఈ గుహల విశిష్టత.

బెలుం గుహల ఉనికి

బెలుం గుహలు బెలుం గ్రామానికి 1 1/2 కి.మీ దూరాన నైరుతి దిశలో ఉంటాయి. బస్సు సౌకర్యం వుంది.

సందర్శన వేళలు: ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం గం.5-30 గంటల వరకు

గుహలోపలికి ఛార్జీలు: పెద్దలకు రూ.30/- పిల్లలకు రూ.20/-

హరిత అతిథి గృహం డార్మిటరీ బెడ్-రూ.40/-.





కనిపెట్టండి చూద్దాం

ఫ్రెండ్స్... కింద వున్న అక్షర సమూహంలో కొన్ని పదాలు ఇమిడి వున్నాయి. అవేంటంటే... GRANDMA, FAIRY DREEMS,CELESTE,FAIRY DUST, STAR, PALACE, MOONULAM,DREAMLAND, LVIL. ఇప్పుడు మీరేం చేయాలంటే ఈ పదాలన్నింటిని వెతికి వాటికి సున్నా చుట్టేయండి.

O	H	E	H	S	S	F	A	I	R	Y	D	U	S	T
S	N	P	F	F	M	F	F	L	G	O	M	X	D	G
H	E	C	A	L	A	P	B	R	I	C	W	F	I	W
L	C	E	J	D	E	P	A	B	S	F	I	I	D	C
V	L	D	K	Z	R	N	D	E	W	B	Q	N	Q	E
V	L	D	T	O	D	M	K	U	W	V	A	Z	I	L
E	E	S	K	M	Y	F	O	U	G	L	I	B	Q	E
B	I	J	A	D	R	O	Q	O	M	F	G	I	J	S
K	D	V	S	F	I	V	Y	A	N	D	T	J	J	T
R	J	Y	E	F	A	O	E	O	B	B	B	T	C	E
A	L	B	N	Y	F	R	X	F	U	A	E	Z	C	Y
T	F	U	U	Z	D	E	W	U	H	R	O	A	Q	H
S	B	F	M	T	D	A	X	U	C	C	F	U	M	U
J	Q	Y	F	J	C	Q	K	Q	B	J	G	Y	T	T
Z	H	K	C	M	L	Z	M	G	R	B	F	G	P	B

రంగులు వేద్దామా!



థ్యాంక్యూ అమ్మా...

హాయ్ నేస్తాలూ! ఈ మాట అమ్మకు మీరు చాలాసార్లు చెప్పి వుంటారు కదూ! ఓ బుజ్జి ఉడుత కూడా వాళ్ల మమ్మీకి థ్యాంక్స్ చెప్పింది. అది ఎందుకో! ఎప్పుడో! తెల్సుకుందామా!!

ఓసారి చిన్నారి ఉడుత నేల మీద ఆడుకుంటానని అమ్మను ఒప్పించి వచ్చింది. అలా చిలిపిగా అటూ ఇటూ గెంతుతోంది. పైనుంచి తల్లి ఉడుత దీని ఆటలు కనిపెడుతూనే వుందనుకోండి! ఇలా వుండగా... ఓ మాయదారి కుక్క వచ్చి బుజ్జి ఉడుత మీద దాడి చేసింది. అంత పెద్ద కుక్కను చూసేసరికి చిన్నారి ఉడుత బిక్కచచ్చిపోయింది. ఇంక తనకు నూకలు చెల్లినట్టేననుకుంది. కానీ బిడ్డ ప్రమాదంలో వుంటే ఏ తల్లి మాత్రం చూస్తూ ఊరుకుంటుంది. ప్రాణాలకు తెగించి మరీ కాపాడదూ! ఉడుత తల్లి కూడా అదే సాహసకృత్యం చేసింది. ఒక్క ఉదుటన కుక్క మొహం మీద దాడిచేసి తన వాడిగోళ్లు, పదునైన పళ్లతో గాయం చేసింది. తట్టుకోలేని కుక్క చిన్నారి ఉడుతను వదిలేసింది. అలా తన బిడ్డను కుక్కకు ఆహారం కాకుండా కాపాడుకుంది పెద్ద ఉడుత. తల్లీబిడ్డా క్షేమంగా చెట్టెక్కాయి.

పెద్ద ప్రమాదం తప్పినందుకు సంతోషించిన చిన్నారి ఉడుత అప్పుడు చెప్పింది 'థ్యాంక్యూ అమ్మా' అని.

క్రిస్మస్ చెట్టు

చేసేద్దాం



హాయ్ పిల్లలూ!

క్రిస్మస్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటాం కదా! మరి క్రిస్మస్ ట్రీని తయారు చేసి రెడీగా పెట్టుకుందామా? దాన్ని ఎంచక్కా మన ఇంట్లోనో, క్లాస్ రూములోనో పెట్టుకోవచ్చు. లేదంటే మీకిష్టమైన స్నేహితులకు ఇవ్వొచ్చు. అయితే దాన్ని ఎలా తయారుచేయాలో చూద్దాం.

కావలసిన వస్తువులు:

ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగు పేపర్లు, చార్టు, కాఫీ కలర్ స్కెచ్, పెన్సిల్, కత్తెర, గమ్.

తయారుచేసే విధానం:

ముందుగా ఆకుపచ్చ పేపరు తీసుకోండి. దానిమీద చిన్న చేతి ఆకారం గీసుకోవాలి. దీన్ని కత్తిరించాలి. అలాంటి చేతులు చాలా చేసి పెట్టుకోవాలి. మనం చేసుకోదలిచిన చెట్టు సైజుకు సరిపడా అన్నమాట. ఇప్పుడు చార్టుమీద త్రిభుజం ఆకారాన్ని గీసుకోవాలి. ఇది చెట్టు ఆకారం అన్నమాట. ఇప్పుడు చెట్టు కాండం కావాలి కదా. దీన్ని కూడా చార్టుతోనే తయారు చేద్దాం. చార్టు మీద దీర్ఘ చతురస్రాకారం గీసి కత్తిరించాలి. తర్వాత దానికి కాఫీ రంగు వేస్తే సరి. ఇవి రెండూ మనం చెయ్యాలనుకున్న చెట్టు సైజును బట్టి కత్తిరించుకోవాలన్నమాట. దాన్ని ఇంతకుముందు గీసుకున్న చెట్టు ఆకారం కింద గమ్‌తో అంటించాలి. ఇప్పుడు చేతిగుర్తు కాగితాలను చెట్టు ఆకారంమీద (త్రిభుజం) కింద నుండి పైవరకూ వరుసగా అంటించాలి. ఇప్పుడు పసుపు రంగు పేపరును నక్షత్రం ఆకారంలో కత్తిరించుకోవాలి. దాన్ని చెట్టు పైభాగాన అతికించాలి. ఇక క్రిస్మస్ చెట్టు తయారైనట్టే. ఇంకా దాని మీద మనకు నచ్చిన క్రిస్మస్ మెసేజ్‌ని రాసుకోవచ్చు. ఈ చెట్టును మీ ఇంటి తలుపుకు అతికించొచ్చు. అలాగే క్లాస్‌రూములో కూడా గోడకు అతికించొచ్చు. క్లాస్‌లో పెట్టదలచుకుంటే వాటి మీద మీ స్నేహితుల పేర్లు, క్రిస్మస్ శుభాకాంక్షలు కూడా రాసుకోవచ్చు.

దారి చెప్తే

నేస్తాలూ... శాంతాక్లాజ్ తాత దగ్గరికి వెళ్లడానికి చకచకా దారి వెతికేద్దామా.

సంతకం



రాజ్ కపూర్

కనిపెడదాం

నేస్తాలూ... కింద కొన్ని వస్తువులు, ప్రాణులు వున్నాయి.
అవి ఏన్నో, వాటి పేర్లేంటో చెప్పండి.



జవాబు : 1.చేప, 2. పాము, 3.నెలవంక, 4.సీతాకోకచిలుక, 5.ఏనుగు, 6.పిల్లి, 7.గొడ్డలి, 8.టోపీ.



తెలుగు విలనీ తెర మరుగేనా!

- తెలకపల్లి రవి

తెలుగు నాట విలన్లు తగ్గిపోతున్నారంటే నమ్ముతారా? నవ్వుతారుగాని! ఇన్ని అక్రమాలూ, ఆక్రమణలూ, అఘాయిత్యాలు జరుగుతుంటే విలన్లు లేకపోవడమేమిటని నిలదీస్తారు.. కానీ మేం చెప్పేది తెలుగు సినిమాల సంగతి... ఎందరో అతిరథ మహారథుల వంటి విలన్లను చూసిన తెలుగు సినిమా కళామతల్లి ఇప్పుడు పరభాషా విలన్లకే పరిమితమై విలవిల్లాడుతున్నది. కాకపోతే ఈ సత్యం గుర్తింపుకు నోచుకోకపోవచ్చు... ఎందుకంటే తెలుగు సినిమాలన్నిటిలోనూ పరభాషా నాయికలే కనిపిస్తున్నారే.. అందమైన తెలుగమ్మాయిలే కరువైపోయారా? అనే ప్రశ్న తరచూ వినిపిస్తుంటుంది. నిజంగానే ఒక్కో సినిమాలో ఒక కొత్తమ్మాయి కనిపించి డబ్బింగ్ గొంతులన్నీ ఒకే విధంగా వినిపిస్తుంటే విసుగొస్తుంటుంది కూడా.. అయితే తమాషా ఏమంటే నాయికల విషయంలో కంటే ప్రతినాయకుల విషయంలో ఇది మరింత నిజం. తెలుగు విలనీ తెరమరుగై పోయినట్టే అనిపిస్తుంది. నేటి అచ్చ తెలుగు విలన్లను చెప్పమంటే నోరు మూతపడిపోతుంది. చెప్పే కొన్ని పేర్లు కూడా ఇప్పుడు పెద్దగా తెరపై కనిపించడం లేదని అర్థమవుతుంది. నాయికల లాగే విలన్లూ బాలివుడ్ నుంచి దిగిపోతున్నారు. ఇప్పటి యువ ప్రేక్షకులను అడిగితే చెప్పే పేర్లన్నీ హిందీ విలన్లవే!

ఒక్కసారి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళితే ఎంత గొప్ప విలన్లు,.. ఎంత మహత్తర నటన.. హీరోలకు ఏ మాత్రం తీసిపోని స్టార్‌డం.. కొన్నిసార్లు హీరోలను కూడా దాటిపోయే ప్రతిభా పాటవాలు.. అందులోనూ క్రౌర్యం, గాంభీర్యం, డైలాగులు, కామెడీ వంటి అనేకానేక ప్రత్యేకతలు. మేకవన్నె పులుల వంటి సాఫ్ట్ విలన్లు... క్యారెక్టర్ యాక్టింగులోనూ రాణించే వారు, హీరోలైన వారు.. సవ్యసాచుల్లా నాయక ప్రతినాయక పాత్రలను పోషించగలిగిన వారు. ఎవరి స్టైలు వారిదే.. ఎవరి రూటు వారిదే..

విలన్ల పాత్రలు కూడా వివిధ రకాల చిత్రాల్లో వివిధ రకాలు. పౌరాణిక చిత్రాల్లోనైతే కంసుడు, హిరణ్యకశ్యపుడు, రావణాసురుడు, దుర్యోధనుడు వంటి వారు విలన్లు. జానపదాల్లో మాంత్రికులు, దుష్టులైన మంత్రులూ సేనాధిపతులు, రాజ వంశీకులు విలన్లు.. సాంఘికాల్లోనూ క్రైమ్ సినిమాలైతే హంతకులు, దొంగల నాయకులు, అక్రమ రవాణాదారులు, సంఘ వ్యతిరేక శక్తులూ.. ఇలా.. ఇక ఇతర సినిమాల్లోనైతే మేనమామలు, సవతి తమ్ముళ్లు, దుష్టబావలు, మోసకారి భాగస్తులు, వగైరా వగైరా..అరుదుగా ఆడవిలన్లు.. సూర్యకాంతం వంటివారు విలన్ హోదా పొందని గయ్యాళి పాత్రలే గాని చాలా కథలకు వారే ఆ లోటు పూరించే తారలు.. ఇలా ఇన్ని రకాల విలనీలు.. అన్నిటిలోనూ తెలుగు వారు అద్భుతంగా రాణించారు. 'ఆహా' అనిపించుకున్నారు.

మొదటి తరంలోనైతే వేమూరి గగ్గయ్య, గోవిందరాజుల సుబ్బారావు వంటి వారు విలన్లు. తర్వాత సిఎస్ఆర్, లింగమూర్తి, ఎస్వీఆర్, నారాయణరావు తదితరులు.. ఇందులో కొందరు కొనసాగి కొండ శిఖరాలు చేరగా కొత్తవాళ్లు వచ్చి కలుస్తూనే వున్నారు. ఆ విధంగా విలన్ల ప్రపంచం విస్తరిస్తూ వచ్చింది. "హ.. హ.. హ.." అనే నవ్వు వినిపించగానే విలనీ కళ్లముందు సాక్షాత్కరించే స్థితి.

ఆధునిక తెలుగు సినిమాలో అంటే ఎన్టీఆర్, ఏఎన్నార్‌లు ప్రధాన హీరోలుగా మారిన తర్వాత కాలంలో విలనీని పరిశీలిస్తే విశేషాలెన్నో కనిపిస్తాయి. ఇక్కడ కూడా ఒక మాట చెప్పుకోవాలి. ఎన్టీఆర్ సినిమాల్లో విలన్‌కు వున్న ప్రాధాన్యత నాగేశ్వరరావు చిత్రంలో వుండదు. ఎందుకంటే ఆయనవి ఎక్కువగా ప్రేమకథా చిత్రాలు. వాటిలో ప్రతినాయకుడి పాత్ర తక్కువ. పైగా పెద్ద విగ్రహం లేని అక్కినేని విలన్ ముందు నిలబడితే పీలగా కనిపించేవాడు గనక ఫైటింగులు డైలాగులు కొంచెం తక్కువగా పెట్టేవారు.

ఈదశలో విలనీకి పర్యాయపదంగా వెలుగొందినవాడు రాజనాల. సాంఘిక, పౌరాణిక, చారిత్రక చిత్రాలన్నిటిలోనూ తన నటనతో గొప్ప ముద్ర వేసిన వాడు రాజనాల. అందమైన గంభీర విగ్రహం, స్ఫుటమైన వాచకంతో హీరోకు ఏ మాత్రం తీసిపోకుండా అదరగొట్టేవాడు. అందులోనూ మొహం విరుపుతో క్రూరత్వాన్ని పండించేవారు. కళ్లు పైకి ఎగరేస్తే అందులో దుష్టత్వం తాండవించేది. గంభీరమైన కంఠం. అప్పట్లో లెక్కకు మిక్కుటంగా వచ్చిన జానపదాలలో హీరో రామారావు, కాంతారావు ఎవరైనా విలన్ మాత్రం రాజనాలే. దుష్టసేనాపతిగా రాజును కాసేపు పక్కదోవ పట్టించి చివరికి ధిక్కారం వినిపించే రాజనాల తరహా ప్రేక్షకులకు ఎంతగానో నచ్చేది. సాంఘికాల్లోనూ పల్లెటూరి

భూస్వామి వేషానికైనా పట్నంలో మదించిన ధనస్వామికైనా రాజనాల బాగా నప్పేవాడు. కొంతలో కొంత కామెడీ కూడా చూపించేవాడు. నమ్మించేట్టు మాట్టాడ్డం, మించిపోతే భయపెట్టడం రెండింటిని కూడా గొప్పగా పలికించేవాడు. తెలుగు తెరపై విలన్ వైభవానికి ప్రతీక రాజనాల. పైగా కొంతమందిలా ఆయన క్యారెక్టర్ నటనవైపు గాని, హీరోయిజం వైపు గాని మారలేదు. హిందీలో ప్రాణ్‌కు సమానమైన ప్రఖ్యాతి ఎవరికైనా వుందంటే అది రాజనాలకే. అలాంటి రాజనాల దయనీయ స్థితిలో మరణించడం ఒక విలన్ విషాదం.



ఈ ఇద్దరికి మధ్యలో చెప్పుకోదగిన విలన్లు మరికొందరున్నారు. ఆర్.నాగేశ్వరరావు వారిలో ఒకరు. పెద్దవిగ్రహం, అర్థవంతమైన నటనతో ఆయనను చూస్తే తనకు కొంచెం ఈర్ష్యగా వుండేదని అక్కినేని ఆత్మకథలోనే రాసుకున్నారు (తన స్వంత చిత్రం దొంగరాముడుకు సంబంధించి). అయితే ఆయన అనారోగ్యం కారణంగా త్వరగా మరణించడం పెద్ద లోటుగా మిగిలింది. జగ్గయ్య హీరోగానూ, విలన్‌గానూ, క్యారెక్టర్ నటుడుగానూ రాణించిన ప్రతిభావంతుడు. ఆయన కంచు కంఠం, కళ్లు పెద్ద ఆకర్షణలు. అక్కినేని చిత్రాల్లో ఎక్కువగా ఆయన విలన్‌గా కనిపించాడు. 'ఆత్మబలం, ఆస్తిపరులు' వంటి చిత్రాలలో జగ్గయ్య నటన ప్రధానాకర్షణగా నిలిచింది. తర్వాతి కాలంలో అనేకానేక చిత్రాల్లో నవరసభరితంగా నటించిన జగ్గయ్య అల్లూరి సీతారామరాజులో ధరించిన రూథర్ ఫర్డ్ పాత్ర మకుటాయమానమైంది. ఇదే కాలంలో మరో విభిన్న విలన్ ముక్కామల. ధూళిపాల కొన్ని చిత్రాల్లో విలన్‌గా నటించినా ప్రధానంగా 'శ్రీకృష్ణ పాండవీయం'లో శకుని పాత్ర ఆయనకు ఎనలేని ప్రఖ్యాతిని తెచ్చిపెట్టింది.

ప్రధానంగా క్యారెక్టర్ నటుడుగా గుర్తుకు వచ్చి కంటతడి పెట్టించే ఎస్వీరంగారావు అందరికంటే పెద్ద విలన్. 'చెంతకు చేరవే బుల్‌బుల్' అంటూ 'పాతాళభైరవి'లో ఆయన ధరించిన నేపాళ మాంత్రికుడి పాత్ర చిత్రసీమకే ఒక హైలైట్. మొదట హీరోగా రంగ ప్రవేశం చేసిన ఎస్వీఆర్ స్థూలకాయం కారణంగా అనతి కాలంలోనే విలన్‌గా మారి తండ్రి పాత్రల్లో స్థిరపడ్డాడు. రావణాసురుడు, దుర్యోధనుడు వంటి పాత్రలకు ఆయన పెట్టింది పేరు. ఎన్టీఆర్ తప్ప మరే నటుడూ ఆయన ముందు నిలబడి కనిపించడమే చాలా కష్టం. ఇద్దరు అగ్ర హీరోలతో సమానంగా ప్రకాశించిన ఏకైక నటుడు ఎస్వీఆర్ మాత్రమే.

మరో విలక్షణ విలనీ గుమ్మడిది. గుమ్మడి గుండె నొప్పి అని పేరు తెచ్చుకున్న ఈయన సాఫ్ట్ విలన్‌గా అనేక చిత్రాల్లో నటించారు. అందులోనూ అక్కినేని చిత్రాలే ఎక్కువ. తర్వాతి స్థానం సత్యనారాయణది. అత్యధిక చిత్రాల్లో విలన్‌గా నటించాడు. రెండు మూడు దశాబ్దాల పాటు హీరో ఎవరైనా సరే విలన్ మాత్రం సత్యనారాయణే. ఒకదశలోనైతే ప్రధాన విలన్‌గానో విలన్ల బృందంలో ఒకడిగానో ఆయన లేని సినిమాలు తక్కువ. ఎన్టీఆర్‌ను పోలిన రూపంతో 'సిపాయి కూతురు' చిత్రంతో రంగ ప్రవేశం చేసిన సత్యనారాయణ 'రాముడు భీముడు' వంటి చిత్రాల్లో ఆయనకు డూప్‌గా కూడా నటించాడు. అయితే తర్వాత బాగా లావై పోవడంతో ఆ పోలికలు తగ్గాయి. ఎన్టీఆర్ పరివారంలో వుంటూ సత్యనారాయణ క్రమేణా బాగా అభివృద్ధి చెందాడు. ఆజానుబాహుడు కావడంతో మొహానికి ముసుగేసుకున్న దొంగల నాయకుడైనా, భూస్వామి వేషం కట్టినా అన్ని రకాల చిత్రాల్లోనూ సరిపోయేవాడు. 1970లలో విశ్వనాథ్ తీసిన 'శారద' తర్వాత క్యారెక్టర్ పాత్రలూ పోషించారు. తక్కువ సంఖ్యలోనైనా హీరోగానూ నటించాడు. ఎన్టీఆర్ ప్రోత్సాహంతో దుర్యోధనుడుగానూ, బాపు దర్శకత్వంలో రావణాసురుడుగానూ నటించి క్రమేణా ఎస్వీఆర్‌కు కూడా ప్రత్యామ్నాయమై పోయాడు. 'జంజీర్'ను 'నిప్పులాంటి మనిషి' పేరుతో తెలుగులో తీసినప్పుడు అందులోని షేర్‌ఖాన్ పాత్రకు (ఎస్వీఆర్ మరణం తర్వాత) ఆయననే తీసుకోవడం, అది అద్భుతమైన విజయం సాధించడం తెలిసిన విషయాలే. అదే వూపులో ప్రాణ్ హిందీలో వేసిన పాత్రను 'నా పేరే భగవాన్'గా తెలుగులో అపూర్వంగా చేశాడు. 'యమగోల', 'యమలీల' చిత్రాల్లో యముడుగానూ సత్యనారాయణ విజయానికి ప్రధానంగా దోహదం చేశాయి. స్వంత చిత్ర నిర్మాణ సంస్థను స్థాపించి పలు విజయవంతమైన చిత్రాలు తీశారు. తెలుగుదేశం ఎంపి కూడా అయ్యారు.



సత్యనారాయణ హయాంలో కుడిఎడంగా కనిపించిన విలన్లు ప్రభాకరరెడ్డి, త్యాగరాజు. అప్పటి రౌడీ దొంగల సినిమాల్లో వీరంతా కలిసి పెద్ద గ్యాంగుగా కనిపించేవారు. ఒకరికి ఒంటి కన్ను, ఒకరికి మెడ వూపుడు ఇలా రకరకాల మ్యానరిజమ్స్ పాటించేవారు (హీరో గుర్తు పట్టడానికి వీలుగా). ఈ తరహాలో డజన్ల కొద్ది చిత్రాలు వచ్చి వుంటాయి.

డెబ్బయ్యవ దశకంలో డైలాగులతో గొప్ప సంచలనం కలిగించిన విలన్ నాగభూషణం. వామపక్ష భావాలతో 'రక్తకన్నీరు' నాటకం ద్వారా ప్రసిద్ధికెక్కిన నాగభూషణం రాజకీయ నేతలను ఎండగట్టే విలనీకి పర్యాయపదంగా మారారు. ఎన్టీఆర్ ఆయన కలసి నటించిన 'కథానాయకుడు, పెత్తందార్లు, దేశోద్ధారకులు' వంటి చిత్రాలు పాలకవర్గాల అవినీతి పోకడలను తూర్పారపట్టడంలో మంచిపాత్ర నిర్వహించాయి. పదాల విరుపు, నొక్కడం ఆయన ప్రత్యేకత. నటన కన్నా వ్యంగ్య భాషణాల ద్వారా గొప్పగా చప్పట్లు కొట్టించేవారు. ఈయన కూడా క్యారెక్టర్ వేషాలు వేయడమే కాక నిర్మాతగానూ మంచి చిత్రాలు తీశారు. ఆ డైలాగులలో కొన్ని ఇప్పటికీ జనం నోళ్లలో నానుతుంటాయి.

సత్యనారాయణ మంచి విల [illegible] టీన్ పద్ధతి ఎక్కువ. క్యారెక్టర్ నటుడైన తర్వాత తాగుబోతుగానూ, కరుణరసాత్మకంగానూ

వైవిధ్యభరితమైన నటన ప్రదర్శించినా ఆయన విలనీ మాత్రం మూసధోరణిలోనే వుంటుందనే భావన బలపడుతున్న దశలో వచ్చాడు రావు గోపాలరావు. 'జగత్ కిలాడీలు' చిత్రంలో ఎస్వీఆర్, గుమ్మడి మధ్య ఆయన ప్రవేశించాడు. తమాషా ఏమంటే తర్వాత కాలంలో తన గొంతుకు ప్రత్యేకంగా పేరు తెచ్చుకున్న రావుగోపాలరావు మొదట్లో డబ్బింగ్ గొంతుతో నటించడం! బాపు తీసిన 'ముత్యాల ముగ్గు' ఆయనను తారాపథంలో నిలిపింది. తర్వాత కొంత కాలంపాటు ముఖ్యంగా రాఘవేంద్రరావు దర్శకత్వంలో ఆయన మస్ట్. ఈయనా 'శారద' తోనే క్యారెక్టర్ నటుడయ్యాడు. ఎన్టీఆర్ నుంచి చిరంజీవి వరకూ అనేక మంది హీరోలకు ధీటుగా విలనీ పలికించి భేషనిపించుకున్నాడు. అడవి రాముడు, వేటగాడు వంటి సినిమాల్లో రావు గోపాలరావు, సత్యనారాయణ ఇద్దరూ కలసి కథను పండించిన తీరు మర్చిపోలేనిది.

స్వర్గం నరకంలో దాసరి నారాయణరావు తీసుకొచ్చిన మోహన్‌బాబు తర్వాత విలన్‌గా స్థిరపడ్డాడు. ఎన్టీఆర్ లాటి విగ్రహం, ఖంగున మార్మోగే కంఠంతో మోహన్ బాబు ఒక విలక్షణ స్థానం సంపాదించుకున్నాడు. కొంతకాలం హీరోగా ప్రయత్నించి మళ్లీ విలనుగా మారి ప్రత్యేకమైన మాడ్యులేషన్‌తో వెకిలి వేషాలతో గిలిగింతలు పెట్టాడు. తర్వాత మళ్లీ స్వంత చిత్రాలతో పెద్ద విజయాలు సాధించి అగ్రనటులలో ఒకడయ్యారు. దాసరి తీసుకొచ్చిన గోకిన రామారావు కూడా కొన్ని చిత్రాల్లో విలన్‌గా బాగానే నటించినా కొద్ది కాలమే. అలాగే నూతన్ ప్రసాద్ నూటొక్క జిల్లాల అందగాడుగా అడుగు పెట్టి పలు చిన్న చిన్న చిత్రాల్లో విలనుగా అలరించాడు. ఆయనలోనూ కామెడీ ఎక్కువే. అయితే అనుకోని విధంగా ప్రమాదంపాలు కావడంతో ఆయన నటజీవిత విజృంభణకు ఫుల్‌స్టాప్ పడింది.

తర్వాత చెప్పుకోదగిన మరో ప్రముఖ విలన్ కోట శ్రీనివాసరావు. ప్రతిఘటన చిత్రంలో అసలు విలన్‌గా తమిళనటుడు చరణ్ రాజ్ నటించినా రెండో విలన్‌గా మంత్రి కాశయ్య పాత్రలో కోట ప్రవేశించారు. ఆయన తెలంగాణా సంభాషణలు విపరీతంగా ఆకర్షించాయి. కొత్త వరవడి పెట్టాయి. అప్పటి నుంచి కోట కొన్ని వందల సినిమాలలో వరుసగా నటించి విజయదుందుభి మోగించారు. సంభాషణలలో కామెడీ కలిపిన ఆయన శైలి ఒక ప్రత్యేకతగా మారింది. ఆహ నా పెళ్లంటలో పొట్ట పగిలేలా నవ్వించాడు. అయితే కొన్ని సందర్భాల్లో వెకిలిగా వుంటుందన్న భావన కూడా తీసుకురాకపోలేదు. రచయిత, నటుడు గొల్లపూడి కూడా ఎనభయ్యవ దశకంలో అనుకోని విధంగా చిత్రాల్లోకి వచ్చి అనేకానేక చిత్రాల్లో విలనుగానూ, సహాయకుడుగానూ కనిపించాడు. మాడ్యులేషన్‌లో తనదీ ఒక శైలి.

కోట తర్వాత తెలుగు విలనీకి గ్రహణం పట్టిందనే చెప్పాలి. రఘువరన్, అమ్రీష్ పురి మొదట, ఆ పిమ్మట ప్రకాశ్ రాజ్‌లు తెలుగు తెరకు ఆరాధ్యులయ్యారు. అమ్రీష్ పురి జగదేకవీరుడు అతిలోక సుందరి వంటి చిత్రాల్లో బాగా ఆకర్షించాడు. గంభీరమైన కంఠంతో ఆయన తన డైలాగులు తనే చెప్పుకోవడంలో తెలుగు భాష ఉచ్చారణ దెబ్బతింటున్నా అదే ఒక ఆకర్షణగా మారింది. పెద్ద హీరోల చిత్రాలలో ఆయన వుండటం



హీరో విలన్లు / విలన్ హీరోలు!

సినిమాల్లో, నాటకాల్లో హీరోలు, విలన్ల పాత్రలు ముందే నిర్ణయమై వుంటాయి. కాని జీవితంలో అన్నీ కలగలసి వుంటాయి. పాత్రల సంగతి ఎలావున్నా పాత్రధారులను పరిశీలిస్తే హీరోలు విలన్ల మధ్య 'శాశ్వత విభజన' ఏదీ వుండదని కూడా తెలుస్తుంది. కాకపోతే ఎవరు ఏ తరహా పాత్రలు ఎక్కువగా ధరిస్తే దాన్నిబట్టి వారిపట్ల అభిప్రాయం ఏర్పడుతుంటుంది. హీరోగా పాతుకు పోయిన వారు ప్రతికూల పాత్ర వేసినా ఆరాధనా భావం వుంటుంది. అదే విలన్లుగా ప్రసిద్ధులైన వారు మంచి పాత్ర వేసినా దాన్ని అర్థం చేసుకోవడానికి కొంచెం సమయం పడుతుంది. ఇదో సినీ లాజిక్.

వాస్తవానికి మన నటుల్లో హీరోలు, విలన్లు అని రేఖ గీయదగినవారు కొద్ది మందే. అక్కినేని చాలా వరకు సాత్విక పాత్రలే ధరించారు. మిగిలిన వారంతా ఎప్పుడో అప్పుడు ఏదో మేరకు ప్రతికూల పాత్రలు, దుష్టపాత్రలు కూడా ధరించిన వారే. వీరిలో అగ్రగణ్యుడు ఎన్టీఆర్. అసలు మనదేశంలో ఆయన ప్రవేశమే విలన్‌గా (అంటే దుష్ట పోలీసు అధికారిగా) తర్వాత కూడా 'పల్లెటూరి పిల్ల, పరివర్తన' వంటి చిత్రాల్లో కొంచెం నెగిటివ్ పాత్రల్లో కనిపించాడు. అన్నిటినీ మించి పౌరాణిక చిత్రాల్లో రావణాసురుడు, దుర్యోధనుడు వంటి విలన్ పాత్రలు వేసి వాటికి హీరోయిజం అద్దారు! అలాగే ద్విపాత్రాభినయ చిత్రాల్లోనూ ఒక పాత్ర నెగిటివ్‌గా కనిపించే ఉదాహరణలున్నాయి. ఈ తరంలో జగ్గయ్య కూడా విలన్‌గానూ రెండవ హీరోగానూ కూడా ఏకకాలంలో రాణించారు. అలాగే హీరో కృష్ణ కూడా 'అంతం కాదిది ఆరంభం' వంటి చిత్రాల్లో ప్రతికూల పాత్రలు వేశారు. శోభన్‌బాబు 'మానవుడు దానవుడు'లో అలాంటి ప్రయోగం చేశారు. కృష్ణంరాజు రావడమే విలన్‌గా వచ్చి కొన్ని చిత్రాలయ్యాక హీరోగా మారారు. నాగేశ్వరరావు కూడా ఒకటి రెండు సినిమాల్లో ఇలాంటి పాత్రల్లో కనిపించక పోలేదు

ఈ కోవలో బాగా చెప్పుకోవలసిన వ్యక్తి మోహన్‌బాబు. 'స్వర్గం నరకం'లో హీరోగా వచ్చి తర్వాత విలన్‌గా మారాడు. వందల సినిమాల్లో మెప్పిస్తూ హీరో కావడానికి కృషి చేశాడు. కొన్ని పరాజయాల తర్వాత మళ్లీ విలన్ వేషాలేస్తూ క్రమంగా హీరోయిజం నిరూపించుకున్నారు. రెండు రకాలుగానూ తనదైన ముద్ర వేశారు.చిరంజీవి కూడా మొదట్లో నెగిటివ్ షేడ్స్ వున్న పాత్రలతోనే ఆకర్షించి అగ్రకథానాయకుడైనారు. బాలకృష్ణ కూడా 'సుల్తాన్' వంటి చిత్రాల్లో నెగిటివ్ పాత్ర వేశారు. శ్రీహరి కూడా విలన్, హీరో రెండూ చేశాడు. భానుచందర్, వినోద్ కుమార్, పృథ్వీ, జె.డి.చక్రవర్తి వంటి వారంతా ఇంతే. గోపీచంద్ మొదట హీరోగా వచ్చి పెద్ద విజయాలు లేక 'జయం'తో విలన్‌గా మారి మళ్లీ హీరోపథం వైపు నడిచారు. 'అన్నమయ్య'లో విష్ణుమూర్తిగా అలరించిన సుమన్ 'శివాజీ'లో విలన్‌గా ఆహా అనిపించాడు. విలన్లుగా వేస్తూనే క్యారెక్టర్ నటులైన వారికి లెక్కేలేదు. కనక కచ్చితంగా విలన్లు, హీరోలు అని నటులను విభజించడం కొద్దిమంది విషయంలోనే సాధ్యం.

విలనిన్లు!

హీరోయిన్లలా విలనిన్లన్నమాట. కొత్తగా వుందా? మామూలుగా ఆడ విలన్లు మనకు తెలుసు. అలాంటివారిలో అగ్రస్థానం సూర్యకాంతందే. ఇద్దరు హీరోలున్న 'రక్తసంబంధం'లో ఆమె ఒంటి చేతి మీద విలనిజం చూపించింది. ఛాయాదేవి, సుకుమారి, ఎస్.వరలక్ష్మి వంటివారు కూడా ఆ తరహా పాత్రలు వేసేవారు. కాకపోతే వీటన్నిటినీ గయ్యాళి పాత్రల కింద తీసేస్తారు. తర్వాత కాలంలో శారద, వాణిశ్రీ, నగ్మా, రమ్యకృష్ణ, సౌందర్య, భూమిక వంటివారు ఇలాంటి పాత్రలు వేశారు. ఇప్పుడు టీవీ సీరియళ్లలో వీటి సంఖ్య బాగా ఎక్కువగా వుంటోంది. కాకపోతే చెప్పదల్చుకున్నది అలాటి వారి గురించి కాదు. ప్రధాన విలన్‌పాత్రల్లో కనిపించిన నటీమణుల గురించే. దొంగల ముఠా నాయకురాళ్లుగానో, భూస్వామ్య స్త్రీలుగానో నటించిన వారి సంగతి. ఈ కోవలో భానుమతిని, కన్నాంబను చెప్పుకోవాలి (ఇద్దరూ పల్నాటి యుద్ధంలో నాగమ్మలే) తర్వాత జి.వరలక్ష్మి (దొంగల్లో దొర). 'చాంగురే బంగారు రాజా' అంటూ నర్తించిన రత్న కూడా విలనిన్‌గా కొన్ని చిత్రాల్లో చేశారు. ఇటీవల కాలంలో నళిని 'వీడే'లో భయంకరమైన విలనిజం చూపించారు. శకుంతల గురించి చెప్పనవసరం లేదు. ఇలా విలనిన్ల కథ చాలా వుంది. 'గుండమ్మ కథ'లో సూర్యకాంతం గయ్యాళి అని చూపించే సన్నివేశం ఒక్కటీ లేదట. ఆమె ఆ పాత్రలో కనిపించాక వేరే సన్నివేశాలెందుకన్నాడట చక్రపాణి. అదీ విషయం!

ప్రతిష్ఠాత్మకంగా భావించే దశ వచ్చింది. ప్రకాశ్ రాజ్ అయితే పుంఖానుపుంఖంగా నటించి విజయానికి చిరునామాగా మారాడు. టూ ఇంటలిజెంట్ పెళ్లికొడుకుగా వినోదంలో ప్రవేశించిన ప్రకాశ్ రాజ్ తర్వాత కాలంలో విలనీలో వివిధ రకాలను చూపించి ప్రేక్షకులను ఉర్రూతలూపాడు. తర్వాత కాలంలో మళ్లీ ఏ తెలుగు విలన్ ఆ స్థాయికి చేరుకోలేకపోయాడు. అసలు ఆ విధమైన ప్రోత్సాహం కూడా తగ్గింది.

సమరసింహారెడ్డితో మొదలైన ఫ్యాక్షన్ కథలు కొత్త తరహా విలనీని ప్రవేశపెట్టాయి. జయప్రకాశ్ రెడ్డి ఈ పాత్రలకు పెట్టింది పేరైనా ప్రధానాకర్షణ మాత్రం హిందీ నుంచి వచ్చిన పరభాషా విలన్లే! అజయ్ పి.దేవన్, ముఖేష్ రుషి, షియాజి షిండే వంటి విలన్లు రాయలసీమ ఫ్యాక్షనిస్టులుగా కనిపిస్తుంటే ప్రేక్షకులు 'ఆహా ఓహో' అనడం నిజంగా తమాషా అయిన పరిణామమే! వీరిలోనూ అనేక ప్రత్యేకతలు. షియాజి షిండే అయితే కొంచెం కామెడీ పలికిస్తాడు. సన్నటి ముఖేష్ రుషి విలన్‌గా చేస్తూనే ఒక్కడు వంటి చిత్రాల్లో పోలీసు ఆఫీసర్‌గానూ బాగా మెప్పించాడు. ఇక ఇటీవలే మరణించిన అజయ్ పి దేవన్ అయితే అచ్చమైన తెలుగు వాడిలా కనిపించేవాడు. ముకుల్ దేవ్ ఏకకాలంలో ప్రధాన విలన్‌గా కనిపించడంతో పాటు కొడుకు పాత్రల్లోనూ అమరి పోతుంటాడు. బెంగాలీ విలన్ ఆశిష్ విద్యార్థిది మరో శాడిస్టు శైలి. 'పోకిరి'లో పోలీసు ఆఫీసరుగానూ 'గుడుంబా శంకర్'లోనూ ఆయన నటన అందరికీ గుర్తుంటుంది. పలు చిత్రాల్లో పాత్రలు చేసినా వెంకీలో పోలీసు శిక్షణనిచ్చే అధికారిగా వుండి, నేరం చేసిన పాత్రలో నటించిన విశాల్ అగ్నిహోత్రి మరింత క్రూరంగా కనిపిస్తుంటాడు. 'సై' చిత్రంలో భిక్షు పాత్రలో కనిపించిన ప్రదీప్ రావల్   కూడా ఒక ఆకర్షణ అయ్యాడు. ఇక తమిళం నుంచి వచ్చిన కళై భవన్ మణి మిమిక్రీ వేషాలతో వెకిలి తనపు విలన్‌గా చేశాడు.

తాజాగా 'అరుంధతి' చిత్రంలో సోనూసూద్ 'వదల బొమ్మాళీ వదల...' అంటూ తెరపై ప్రకంపనలు పుట్టించాడు. మూఢనమ్మకాలపై ఆధారపడిన ఆ చిత్రం అనేక అవార్డులు కూడా తెచ్చుకుంది. ఇప్పుడు ఈయన విలన్ల జాబితాలో అగ్రస్థానాన వున్నాడంటున్నారు. ఇంకా అనేక మంది బుల్లి విలన్లు అన్ని దశల్లోనూ వుంటున్నారు. గిరిబాబు, ప్రసాద్‌బాబు, సత్యేంద్రకుమార్, కృష్ణ భగవాన్, ప్రదీప్ శక్తి, పృథ్వీ తదితరులు వివిధ దశల్లో విలన్లుగా మెరిసి మాయమైనారు. ఇప్పుడు కూడా అలాంటి వారున్నారు. హీరో సుమన్ రజనీకాంత్ శివాజీలో విలన్‌గా చాలా బాగా కనిపించినా తర్వాత ఆ తరహా వేషాలు రాలేదు.

తెలుగులో విలన్లు లేదా హీరోయిన్లు ఎందుకు ఎక్కువగా ప్రోత్సాహం పొందడం లేదు? అని ఆలోచిస్తే ఒకటే సమాధానం కనిపిస్తుంది. హీరోలుగా ప్రముఖుల పిల్లలే వస్తున్నారు గనక వారికంటే ఎక్కువ ప్రాధాన్యత మరెవరికీ లభించడం అనుమతించబడదు. గతంలో విలన్లందరూ హీరోలుగానో మరో రకంగానో తారాపథంలోకి ఎగబాకారు. హేమమాలిని వంటి వారు హిందీలోనూ వాణిశ్రీ, శ్రీదేవి వంటివారు తెలుగులోనూ హీరోలతో సమానమైన ప్రాధాన్యత పొందారు. కొన్నిసార్లు మించిపోయారు కూడా. ఆ పరిస్థితి మళ్లీ రాకుండా వుండాలంటే ముందు విలన్లుగానూ హీరోయిన్లుగానూ కూడా బయటివారిని తీసుకోవడం శ్రేయస్కరం. ఎందుకంటే వారెలాగూ ఇక్కడ స్థిరపడే అవకాశం వుండదు. ఈ విలన్లు హీరోలకు పోటీగా మారే ప్రసక్తి కూడా వుండదు. అంతే తప్ప విలన్లను అందించలేనంతగా తెలుగు కళారంగం గొడ్డు పోయిందని అనుకోలేము.

వాస్తవానికి హీరోకంటే విలన్ ఏ విషయంలోనూ తక్కువ కాదు. నాయకుడి కంటే ప్రతినాయకుడికి కొంత ఎక్కువ వైవిధ్యం కూడా వుంటుంది. అందుకే విలన్‌గా ఎవరు వేశారన్నది కూడా ముఖ్యమైపోతుంది. ఇప్పుడు సాంకేతిక విలువలపై ఆధారపడి చిన్న వయసులోనే పిల్లలను హీరోలుగా తెస్తున్న రీత్యా తెలుగు ప్రజలకు దగ్గరగా వుండిపోయే విలన్లు వుంటే ఇబ్బందే మరి. ఇదే హీరోయిన్లకు కూడా వర్తిస్తుంది. అందుకే కథల రూపకల్పనలోనే బోలెడు ఆంక్షలు వచ్చేస్తుంటాయి. వారసత్వపు హీరోలు పరభాషా విలన్లపై చూపించే ప్రతాపం ప్రేక్షకులకు గొప్పగా కనిపిస్తుంది. విలన్ హీరోను తినేసే అవకాశం వుండదు. కనక రాజనాల, రావు గోపాలరావు, ఎస్వీరంగారావుల నాటి విలనీని ఇక మర్చిపోవడమే మంచిది. కళాత్మక వ్యాపారమైన సినిమా రంగంలో హృదయం కన్నా మనుగడే ముఖ్యం మరి! ★



విజ్ఞాన వేదిక



గత ఏడాది సెప్టెంబరులో ఈ ప్రయోగం ప్రారంభమైంది. గత సెప్టెంబరు 10న ప్రోటాన్ పుంజాలు విజయవంతంగా పరిభ్రమించాయి. ఆ సందర్భంలోనే ఈ ప్రయోగంపై ఎన్నో అపోహలు చెలరేగాయి. ప్రయోగాల ఫలితంగా బ్లాక్ హోల్స్ (కృష్ణ బిలాలు) ఏర్పడతాయని, తద్వారా భూమి నాశనమౌతుందని చాలా మంది వాదించారు. ఆ వాదనలకు ప్రాచుర్యం కూడా లభించడంతో ప్రజలు భీతావహులయ్యారు కూడా. కానీ ప్రయోగ నిర్వాహకులు మాత్రం అటువంటి భయాలు అర్ధరహితమన్నారు. ప్రోటాన్లు కాంతి వేగంతో ఢీకొనడం ప్రకృతిలో నిత్యం జరుగుతూనే ఉంటుందనీ, అయినా ఎటువంటి ప్రతికూల ప్రభావం తలెత్తలేదనీ వారు వాదించారు. ఏతా వాతా, అనుకోకుండా వచ్చిన విద్యుత్ సమస్య వల్ల ఆనాటి ప్రయోగం ఆగిపోయింది.

మహా విస్ఫోటన ప్రయోగం

- డా॥ కాకర్లమూడి విజయ్

పోయినేడాది వార్తల్లోకి వచ్చి 'రేపు ప్రపంచం అంతమౌతోందా' అన్నంత ఉత్కంఠత కలిగించిన మహా విస్ఫోటం మళ్లీ వార్తల్లోకెక్కింది. విశాల విశ్వపు పుట్టుక, పరిణామాల కారణాలను కనిపెట్టే ప్రయత్నాలు అప్పట్లో అనుకోకుండా ఆగిపోయినా, తాజాగా ఆ క్రమంలో ఒక ప్రయోగం విజయం సాధించింది. మహా విస్ఫోట ప్రయోగం వల్ల విశ్వ జనన కారణాలను తెలుసుకునే ప్రయత్నం ఊపందుకుంది.

గతవారంలో- ప్రపంచంలోనే అతి పెద్ద పదార్ధ విస్ఫోట ప్రయోగశాలగా పేరొందిన ఎల్‌హెచ్‌సి- లార్జ్ హాడ్రాన్ కొలైడర్‌లో ప్రోటాన్లు పరస్పర వ్యతిరేక దిశలో అత్యంత వేగంగా ప్రయాణిస్తూ ఢీకొన్నాయి.

ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ సరిహద్దుల్లో భూగర్భంలో వందల అడుగుల లోతున ఎల్‌హెచ్‌సిని ఏర్పాటు చేశారు. ఈ ప్రయోగశాలలో విశ్వావిర్భావం నాటి పరిస్థితులను అధ్యయనం చేస్తున్నారు. అటువంటి పరిస్థితులను కృత్రిమంగా సృష్టించడం ద్వారా చాలా ప్రశ్నలకు సమాధానం లభించవచ్చని ఆశిస్తున్నారు.

గత ఏడాది సెప్టెంబరులో ఈ ప్రయోగం ప్రారంభమైంది. గత సెప్టెంబరు 10న ప్రోటాన్ పుంజాలు విజయవంతంగా పరిభ్రమించాయి. ఆ సందర్భంలోనే ఈ ప్రయోగంపై ఎన్నో అపోహలు చెలరేగాయి. ప్రయోగాల ఫలితంగా బ్లాక్ హోల్స్ (కృష్ణ బిలాలు) ఏర్పడతాయని, తద్వారా భూమి నాశనమౌతుందని చాలా మంది వాదించారు. ఆ వాదనలకు ప్రాచుర్యం కూడా లభించడంతో ప్రజలు భీతావహులయ్యారు కూడా. కానీ ప్రయోగ నిర్వాహకులు మాత్రం అటువంటి భయాలు అర్ధరహితమన్నారు. ప్రోటాన్లు కాంతి వేగంతో ఢీకొనడం ప్రకృతిలో నిత్యం జరుగుతూనే ఉంటుందనీ, అయినా ఎటువంటి ప్రతికూల ప్రభావం తలెత్తలేదనీ వారు వాదించారు. ఏతా వాతా, అనుకోకుండా వచ్చిన విద్యుత్ సమస్య వల్ల ఆనాటి ప్రయోగం ఆగిపోయింది.

భూమిలోపల 150 నుండి 570 అడుగుల లోతులో 27 కిలోమీటర్ల చుట్టుకొలతతో వర్తులాకారంలో ఉండే సొరంగం వంటి దారిలో ప్రోటాన్లను దాదాపు కాంతి వేగంతో ప్రయాణింపజేయడం ఈ ప్రయోగంలో ముఖ్య ఘట్టం. ప్రోటాన్లు వర్తులాకారంలో తిరగడానికి సుమారు 800 భారీ అయస్కాంతాలను అమర్చారు. అవి ప్రోటాన్లకు గతి నిర్దేశం చేస్తాయి.

గత సోమవారం ప్రోటాన్లు 900 గిగా ఎలక్ట్రాన్ వోల్టుల శక్తితో పరస్పరం ఢీకొన్నాయి. అంత శక్తితో, దాదాపు కాంతి వేగంతో ఢీకొనడం వల్ల ప్రోటాన్లు మరింత చిన్న పదార్ధాలుగా విడిపోతాయి.

అలా విడిపోవాలంటే వాస్తవానికి ప్రోటాన్లకు మరింత వేగం, శక్తి అవసరం. అందువల్ల వాటికి క్రమంగా 1.2 ట్రిలియన్ ఎలక్ట్రాన్ వోల్టుల శక్తిని అందిస్తారు. ఆ శక్తి ఫలితంగా జరిగిన విస్ఫోటనలో విడుదలైన సూక్ష్మకణాల విశ్లేషణే కీలకం.

ఆ సమయం కొన్ని వేల సంవత్సరాల క్రితం విశ్వావిర్భావ సందర్భంలో ఏర్పడిన బిగ్‌బ్యాంగ్ నాటి పరిస్థితులను పునరావిష్కరిస్తుంది. పదార్ధపు అత్యంత ప్రాథమిక రూపాన్ని అవగాహన చేసుకోవడానికి కావలసిన అంశం ఏదో ఒకటి ఇంకా అవగతం కాలేదు. అటువంటిది ఒకటి ఉందని ఎడిన్ బర్గ్ ప్రొఫెసర్ పీటర్ హిగ్స్ ప్రతిపాదించాడు.

ఈ ప్రయోగాల వల్ల పదార్ధపు 'మాస్' (ద్రవ్యరాశి)కి కారణంగా భావించే 'హిగ్స్ బాసన్' - దీనినే దైవ కణం అని కూడా అంటున్నారు. - దీనిని కనుగొనే ఆశతో ఉన్నారు.

ఆ దశకు చేరడానికి ఈ ప్రయోగం ఇంకా కొనసాగించాల్సి ఉంది. భౌతిక శాస్త్రంలో మరింత లోతైన అధ్యయనాలకు, విశ్లేషణకు ఈ ప్రయోగం దారితీస్తుంది. కాకపోతే, ఇంత భారీ ప్రయోగం (భారీ ఖర్చు కూడా!) అవసరమా అని కొందరి వాదన. ★



నవ్వుల్ - పువ్వుల్

తర్వాత...

పేషెంట్ : మీరు నాకు మంచి మందులు ఇవ్వడంలేదని మావాళ్లు ఆరోపిస్తున్నారు సార్.

డాక్టర్ : వాళ్లంతా తెలివి తక్కువవాళ్లు. పోస్టుమార్టం అయిన తర్వాత వారే నిజం తెలుసుకుంటారు.

నిజాయితీ

విలేకరి : నీ చుట్టుపక్కలవారు నిజాయితీ పరులేనా?

రైతు : చాలా నిజాయితీ పరులు. అనుమానమే లేదు.

విలేకరి : మరి చేతిలో ఆ గన్నెందుకు?

రైతు : దీనివల్లే వారంతా నిజాయితీగా వుండేది.

గిఫ్ట్

గిరిజ : ఈ గొడుగు ఎక్కడ కొన్నావ్?

వనజ : ఇదా! మా అన్న కానుక.

గిరిజ : నీకు అన్నదమ్ములు ఎవరూ లేరుగా.

వనజ : ఏమో హ్యాండిల్ మీద అదే ప్రింట్ చేశారు.

మంచోళ్లు

రాము : లావాటివారిది చాలా వరకు మంచి మనస్తత్వం.

శ్యామ్: అలా అని ఎలా చెప్పగలవు?

రాము : నిన్నే చూడు. నేనమన్నా అని పరిగెత్తినా.... నావెంట పడలేవుగా.

మంచి కుక్క

గోపి : మా కుక్క చాలా తెలివైంది. చురుకైంది. ప్రతి ఉదయం పరిగెత్తుకుంటూ వెళ్లి నాకు న్యూస్ పేపర్ తెచ్చిస్తుంది.

మనోజ్ : ఇందులో అంత గొప్పేముంది?

గోపి : ఆ పేపర్లన్నీ మా కాలనీలోని వారివి.

ముందు...తర్వాత

రవి : పెళ్లికి ముందు నీవు ఏం చేసేవాడివి?

కవి : బోధకుడిని

రవి : మరి ఇప్పుడేం చేస్తున్నావ్?

కవి : విద్యార్థిగా వున్నాను.

రవి : అదేంటి?

కవి : బోధించే విషయాలన్నీ మా ఆవిడ చూసుకుంటుంది. వినేవన్నీ నేను చూసుకుంటున్నాను.

గొంతు

రామారావ్ : మా ఆవిడ గొంతు ఇప్పుడు ఎంతగా మారిపోయిందో!

వెంకట్రావ్ : ఎలా చెప్పగలవ్?

రామారావ్ : మొన్న మొన్నటి వరకు మా ఆవిడ పాటలు ఇంట్లోనే వినబడేవి. ఇప్పుడు మా బజారు వారంతా చక్కగా వింటున్నారు.

నిద్రాభంగం



కొడుకు : నాన్నా! నాకు ఒక డోలు కొనిపెట్టు.

తండ్రి : కొనిపెడతా కానీ నన్ను డిస్టర్బ్ చేయొద్దు.

కొడుకు : అలాగే నాన్నా, నువ్వు నిద్రపోయిన తర్వాతే వాయించుకుంటా.

- లక్ష్మీ నారాయణ

క్రైమ్ కథ

మట్టి బుర్రలు కావు

- యర్నాగుల సుధాకరరావు

సవరబిడ్డిక కట్టెలమోపు కట్టి తీసుకొస్తున్నాడు మధ్యాహ్నం. ఎండ నడినెత్తి మీద నిప్పులు చెరుగుతోంది. ఆకాశాన్నంటే చెట్ల మధ్యకు చేరి ఎండవేడిమి నుంచి తప్పుకున్నాడు. ఆకలికి కడుపు దహించుకుపోతోంది. మెల్లగా కట్టెల మోపును దించాడు. అక్కడ సీతాఫలం చెట్లు విరగకాసి కనిపించాయి. ఏదో కుళ్లిన మృగం వాసన వేసింది. ఏదోచచ్చింది అని సరిపెట్టుకుని చెట్టెక్కి పండిన పళ్లను తీసి ఆబగా తినసాగాడు. కడుపులో ఆకలిని తాత్కాలికంగా చంపేసే వరకు తిన్నాడు. అప్పుడు తేలికగా అనిపించి కిందకు దిగి కట్టెలమోపు వైపు నడిచాడు.

సరిగ్గా అప్పుడే కుక్కల అరుపు వినిపించింది. అటుతిరిగి చూశాడు. ఆ అరుపులు గూడెంలో కుక్కల అరుపుల్లా లేవు. అందుకే ఆశ్చర్యంగా చూశాడు. చూస్తుండగానే దగ్గరయ్యాయి. ఒక్కసారి గుండెలు గుభగుభలాడాయి. పోలీసులు, వారి ముందు రెండు కుక్కలు గొలుసులతో. అవి ఈడ్చుకు పోతున్నట్టుగా వాటి వెంట రాసాగారు. నల్లగా నిగనిగలాడుతూ కనిపించాయి. భయం వేసింది. ఒక్కసారి మోపు వదిలి పారిపోవాలనుకున్నాడు. అవి దగ్గరయ్యేకొద్దీ బిడ్డికకు భయం పెరిగి పోసాగింది. కట్టెలమోపు వదిలి పరుగు తీశాడు.

పోలీసులు అదిరిపడ్డారు. పదిమంది పోలీసుల్లో నలుగురు విజిల్సువేసి బిడ్డికను తరిమారు. కుక్కలు నేలను వాసనచూస్తూ అక్కడే ఆగాయి. మిగిలిన ఆరుగురు పోలీసులు కుక్కలతో బాటు అక్కడ వెతకసాగారు. పక్కనే ఆకులు కప్పినచోట ఆగాయి కుక్కలు. పోలీసులు పెద్ద కట్టెతో ఆకుల్ని తొలగించారు. కుళ్లిన శవం. కత్తిపోట్లతో పడి ఉంది. ఎవరో చంపి ఆకులు కప్పేశారు. అడవిలో ఏ హింసాత్మక మృగాల దృష్టిలో పడకపోవడంతో చాలా ఆశ్చర్యపోయారు.

ఆ శవం ఫారెస్టు గార్డుది. అతడు కనిపించడం లేదని ఫిర్యాదు అందుకున్న పోలీసులు మండలంలో వెతికి ఊరుకున్నారు. ఆ తరువాత ఎవరో ఆకాశరామన్న గార్డును తూర్పు కొండల్లో హత్య చేశారని ఒక లేఖ రాశాడు. దాంతో కుక్కలతో వెళ్తే శవం దొరుకుతుంది. లేకుంటే అడవిని మొత్తం గాలించడం కుదిరేపని కాదు అని ఒక నిర్ణయానికి వచ్చారు పోలీసులు. తీరా వచ్చాక అటు శవంతో పాటు హంతకుడు కూడా దొరికాడని పోలీసులు ఆనందించారు. ఆ పారిపోతున్న వాడే హంతకుడు అని ప్రాథమికంగా తేల్చారు. బిడ్డికను ఒక కిలోమీటరు దూరం వెంబడించి పట్టుకుని ఈడ్చుకు వచ్చారు పోలీసులు. వాడు వణికిపోతూ ఏడవసాగాడు.

అతణ్ని ప్రశ్నించారు. "ఏరా చంపి, శవాన్ని ఏ మృగం ఏమేరకు తినేసిందోనని చూడడానికి వచ్చావా? నీకూ నాగరిక హంతకుల బుద్ధి అబ్బింది. ఎందుకు చంపావు?" అని గుడ్లెర్రచేశాడు పోలీసు అధికారి.

"అమ్మో మడిసిని సంపలేను. అదే మచ్చలపులో మరొకటో అయితే బాణమేసేయగలను. అందులో ఇలాంటి కాకీబట్టలోడిని అసలు ఏమీ సేయలేను. నేను సంపలా! ఆకలికి ఇటుగా వస్తిని. పిక్కలపళ్లు (సీతాఫలం)తిన్నాను. నాకు మాంసం మురగపెట్టిన వాసనొస్తుంటే ఏదో మురగం(మృగం) సచ్చింది అనుకున్నాను. కుక్కల్ని, ఆ ఎనక వస్తున్న కాకీలోల్ని సూస్తే నాకు కాళ్లు ఆడలేదు. బయంతో పారిపోనాను" అని శవాన్ని తేరిపార చూసి చెప్పాడు బిడ్డిక.

"నువ్వు నిజం చెప్పు. ఎందుకు చంపావు? ఈ గార్డు అడవిలో పూచికపుల్లను కూడా పోనియ్యడని విన్నాం. నువ్వు కట్టెలు కొట్టుకుని వెళ్తుంటే అడ్డుపడ్డాడని కత్తితో పొడిచావు. ఆ తరువాత ఈ రోజు మోపును తీసుకుపోతున్నావు. శవం ఎలా ఉందో చూడడానికి వచ్చావు. అవునా ఒప్పేసుకో! లేకుంటే చావబాది చెప్పిస్తాం" అధికారి లాఠీతో తలమీద సన్నగా తడ్తూ గుడ్లురిమి చెప్పాడు.

అక్కడికి నాగరికత తెలిసిన గిరిజన నాయకుడు, మరికొంత మంది గూడెంలోని వారు వచ్చారు. విషయం తెలిసి అవాక్కయ్యారు. "ఇదేందిరా ఇలా ఆ గార్డును సంపేసినావు?" అని అడిగారు. బిడ్డిక నెత్తీ నోరూ బాదుకుని చెప్పినా ఇటు పోలీసులుగానీ, అటు గిరిజనులుగానీ వినలేదు. బిడ్డికను జీపు ఎక్కించేశారు. అతడిపై కేసు నమోదైంది. కోర్టులో ఏమడిగినా ఒక్కముక్క అర్థం కాలేదు. తన వాదనను తాను పలుమార్లు వినిపించాడు. సాక్ష్యాలు పెద్దగా లేనందువల్ల ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పేది ఏమీలేదు. అడవిసొత్తును బిడ్డిక దొంగిలిస్తుంటే గార్డు అడ్డుకున్నందుకే హత్యచేశాడని కోర్టు నమ్మి నాలుగేళ్లు శిక్ష వేసింది.

ఆ రోజు కోర్టుకు బిడ్డిక భార్య వచ్చింది. కన్నీళ్లు కారుస్తూ "ఎందుకు సేసావు ఖూనీ, ఆడు నా సెయ్యట్టుకున్నందుకేనా? ఆడు పుచ్చుకుక్క. ఆడిని సంపేవరకు నిద్రపోలేదు నువ్వు. ఆడు నన్నే కాదు. మన జట్టులో సాలామందిని లాగినాడు. అందరికీ ఆడి మీద గుర్రుంది. నువ్వే ఆడి జీవాలు ఆర్పేసినావు. ఖైదులోకి ఎళ్లిపోతన్నావు. ఆమద్య బెవరల సిన్నదాన్ని మారు సమర్తనాడు ఈడు సెరిపినాడంట. అప్పుడే మనజట్టులో ఒక్కడూ ఆణ్ని సంపలేదు. నువ్వు ఎందుకు తెగించి ఆడి కంటము కోసినావు? ఇకనుంచి నేను నీపని కూడా సెయ్యాల. అడవికి పోయి కట్టెలు తీస్కరావాల. నాను ఎళ్తానంటే మనజట్టులోని కొంతమంది మగోళ్లు 'ఇంతముద్ద పడేస్తాం నువ్వు కస్టపడకే' అంటన్నారు. అలా ఎందుకు అంటన్నారో? నాకు తెలిసి చావడంలేదు".

బిడ్డికకు పూర్తిగా అర్థమైంది గార్డును చంపింది గూడెంలోని వారే అని. గార్డుచేసిన అరాచకాలకు వాడ్ని ఖతమ్ చేశారన్న మాట. అందుకే కేసులో తను పీకలోతుకు ఇరుక్కుంటే ఒగ్గేసినారు. ఒక్కడూ నా కోసం ఖైదుగదికి రానే లేదు. ఇప్పుడు నా భార్యాపిల్లలకు ఇంత తిండిపెట్టడానికి సిద్ధ పడుతున్నారంటే, వీళ్లే కడుపుమండి చంపేశారు. అక్కడ ఉన్న తనవారిని రమ్మని పిలిచి మెల్లగా అడిగాడు. "మీరే కదరా ఆగారుడుని సంపేసి ఆ నెపం నామీద నెట్టేసి ఖైదుకు పంపుతున్నారు"

"ఏంట్రోయ్ ఖైదులోకి ఎల్లినాక బుర్ర మా గొప్పగా పనిచేస్తంది. ఎవడా సెప్పినోడు. అలాంటిది లేదు" గుంపులో ఒకడు సెప్పాడు.

"కాదహె నేను సంపక, మీరు సంపక కత్తిపోటు ఎవడు పొడిసినాడు. నేను నమ్మను మీరే సంపారు. లేకుంటే మీ కష్టానికి సంపాయించిన తిండి నా పెళ్లాంకు పెడతారా?"

'రేయ్ మరెందుకు నీతో అబద్దామాడాలి? నువ్వొక్కడితో సరిపోయింది. లేకుంటే మేమంతా ఖైదుల్లోకి పోవాల్సినోళ్లమే" అని గాఢంగా నిట్టూర్చారు.

"నా పెళ్లాం పిల్లల మాటేటి? సూసుకుంటారా? మాటిచ్చినారు. కొండదేవర ఆన గుర్తెట్టుకోండి. వేటాడి నోళ్లకు ఒగ్గేసీ నాకు ఖైదు సేసినారు ఆ కాకీ బట్టలోల్లు" అని తలపట్టుకున్నాడు బిడ్డిక.

★

తెలుసుకుందామా...





వెంకన్న

బొమ్మల మాంత్రికుడు

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా 'ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ మద్రాసు' (పియస్‌యం) వారు జులైలో ఆలిండియా ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించారు. నీటికి సంబంధించిన ఫొటోలకు పోటీకి ఆహ్వానించారు. దీనికి దేశ వ్యాప్తంగా 2,386 మంది ఫొటోగ్రాఫర్లు పోటీలో పాల్గొన్నారు. మద్రాసు సొసైటీ వారి బహుమతి గెలవడం అంత సులభమేమీ గాదు. లైటింగ్, యాక్షన్, మూడ్, బేలన్స్, కంపోజిషన్, టోన్స్ ఎలా వున్నాయి? ఫొటో సహజంగా ఉందా? ఇలా అనేక అంశాలను పరిగణనలోనికి తీసుకుని సెలక్ట్ చేస్తుంటారు. మరి ఈఏడాది విజేత వివరాలు తెల్సుకుందామా!

- పుప్పాల కృష్ణమూర్తి

ఒక్కొక్కరు నాలుగు ఫొటోల చొప్పున ఎంట్రీలను పంపారు. వీటన్నింటిలో మన ఆంధ్రప్రదేశ్‌లోని నల్గొండ జిల్లాకు చెందిన కోదాడ ఫొటోగ్రాఫర్ 'బొమ్మల వెంకన్న' పంపిన 'ఎంజాయింగ్ ది బాత్'కు ప్రథమ బహుమతి లభించింది. ఈ పోటీల్లో రెండవ బహుమతి 'వాటర్ అండ్ లైఫ్'కు దక్కింది. దీన్ని కలకత్తాకు చెందిన ముఖర్జీ గెలుచుకున్నారు. మూడవ బహుమతి 'అంబాడెడ్ ఇన్ సాలిట్యూడ్' పేరుతో పంపిన భూపేష్‌కు వచ్చింది. ఈ ఫొటోల సెలక్షన్‌కు వచ్చింది ప్రసిద్ధ సినిమా డైరెక్టర్ అండ్ కెమెరామెన్ బాలు మహేంద్ర, మరో సినిమాటోగ్రాఫర్ రాజీవ్‌మీనన్‌తో పాటు, క్లబ్ మెంబర్లు కూడా పాల్గొన్నారు. ఈ క్లబ్బుకు 150 సంవత్సరాల చరిత్ర ఉంది. దాదాపు 40 ఏళ్లగా మన ఆంధ్రప్రదేశ్ వాళు పాల్గొంటున్నా, బహుమతి సాధించిన సందర్భాలు లేవు. వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆగస్టు 19వ తేదీన మద్రాసు ఫొటోగ్రఫీ సొసైటీ చైర్మన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ ప్రపంచం ఆశ్చర్యంగా నల్గొండ వైపు చూసింది. ఈ ఘనత తెచ్చి పెట్టింది, తన ఇంటిపేరునే బొమ్మలుగా చేసుకున్న వెంకన్ననే. ఆ నలభయ్యేళ్ల యువకుడి అసలు పేరు కోల వెంకన్న. ఈ ప్రైజు గెలుచుకోవడం ఆనందం కలిగించే విషయమైనా, బహుమతులు గెలవడం ఇతనికి కొత్త కాదు. జె.యన్.టి.యు హైద్రాబాద్ వారు ప్రతీ ఏడాది నిర్వహించే పోటీల్లో వరుసగా ఆరు సంవత్సరాల నుంచి ప్రథమ బహుమతి సాధిస్తున్నాడు. ఈ పోటీల్లో గెలవడం రాష్ట్ర ఫొటోగ్రాఫర్లంతా ప్రతిష్టాత్మకంగా భావిస్తుంటారు.

ఫొటోగ్రఫీ మీదున్న విపరీతమైన అభిమానంతో (అభిమానం అనే కంటే పిచ్చి అనడమే కరెక్టు) ఇంటర్‌లోనే చదువాపేసి, ఆచారి స్టూడియోలో మదనాచారి వద్ద అసిస్టెంటుగా చేరాడు. వారి దగ్గర ఓనమాలు దిద్దుకుని 1984లో స్వంతంగా స్టుడియో పెట్టుకున్నాడు. జీవనభృతికోసం ఫొటోగ్రఫీపై పనిచేస్తూనే కనిపించే ప్రతి దృశ్యాన్నీ విభిన్నంగా ప్రజెంట్ చేయాలని తాపత్రయపడేవాడు. పెళ్లిళ్లు, పండుగలు, బారసాల వంటి ఫంక్షన్లలో తనదైన ముద్రతో విభిన్నంగా తీసి చూపించేవాడు. ఫొటోగ్రాఫర్లకు గురుతుల్యులు, రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ వారి నుండి ఫెలోషిప్ పొందిన ఆంధ్రప్రదేశ్‌లోని ఏకైక ఫొటోగ్రాఫరైన హైద్రాబాద్ రాజన్‌గారి వద్ద మెళకువలు నేర్చుకున్నాడు. ఈ ఫెలోషిప్‌ను బ్రిటీష్ రాణి చేతుల మీదుగా ఇస్తారు. ప్రపంచ ఫొటోగ్రాఫర్లంతా ఈ బహుమతిని ఫొటోగ్రఫీలో నోబెల్ బహుమతిగా భావిస్తుంటారు. భుక్తికోసం ఒక పక్క అంజలి స్టుడియోని చూసుకుంటూనే, ఏడాదిలో ఆరునెలల పాటు కెమెరాను మెడలో వేసుకుని దేశమంతా తిరుగుతుంటాడు. తనకు రాష్ట్రంలో బాగా ఇష్టమైన ప్రదేశం అరకు అని చెప్పే ఈ కెమెరామెన్, ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజనుల్లో అరకులోనే గిరిజన సంస్కృతి ఇంకా సజీవంగా ఉందని చెబుతుంటారు.

రాజన్‌గారి శిష్యులైన తన ఆరుగురు మిత్రులతో కలిసి 2007లో రవీంద్రభారతిలో ఐదు రోజుల పాటు 270 ఫొటోలతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దీనికి మంచి స్పందన వచ్చింది. చక్కటి అనుభవాన్ని, ఆర్థికంగా తృప్తిని ఇచ్చిందని చెబుతుంటారు. తను స్టుడియో నిర్వహించుకుంటూనే కొత్తగా ఫొటోగ్రఫీలోకి ప్రవేశించే యువకులకు క్లాసులు తీసుకుంటూ మెళకువలు నేర్పుతుంటాడు. వెంకన్న చూపిస్తున్న ప్రతిభకు ప్రభావితుడైన శ్రీరాం అనే యువకుడు డిగ్రీ మానేసి, జెయెన్‌టియులో బియఫ్ఎ చేయసాగాడు. అలాగే స్వంతంగా స్టూడియోలు పెట్టుకుని, జీవిస్తున్న వీరరాజు, కోటయ్య వంటి డజను మంది ఫొటోగ్రాఫర్లు వెంకన్న తమ గురువు అని గొప్పగా చెబుతుంటారు. తను క్లాసులో లైటింగ్, ఫంక్షన్‌లకు సంబంధించి కల్చర్ స్టడీ, కెమెరాపై అవగాహనతోపాటు ఫొటో గ్రాఫర్‌కు వుండవలసిన నిబద్ధత, క్రమశిక్షణ గురించి చెబుతుంటారు. ఏడాదికి వేల రూపాయలు ఖర్చుచేసి ఫొటోగ్రఫీకి సంబంధించిన మేగజైన్లను తెప్పించి, స్టడీ చేయడంతో పాటు, తోటి మిత్రులకిచ్చి ప్రోత్సహిస్తుంటారు.

ఫొటోగ్రఫీలో ఉన్న ఇబ్బందుల గురించి చెబుతూ, 'అవుట్ డోర్‌లో ఫ్లాష్ వాడకూడదు. ఉండేది సూర్యుని వెలుగు మాత్రమే. మనం ఎంచుకున్న లొకేషన్‌లో అనుకున్న విధంగా, ఎంచుకున్న సబ్జెక్ట్‌తో తీయడమంటే చాలా కష్టపడవలసి వస్తుంది. ఒక్కోసారి ఒక్కఫొటో కోసమే రోజుల తరబడి కెమెరా పట్టుకుని నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది' అని చెప్పారు. అరకులో అమ్మాయి ఫొటోకోసం, మూడు రోజులు కళ్లలో లెన్సులు బిగించుకుని ఎదురుచూశామని చెప్పారు. కెనాన్ ఫిల్మును, కెనాన్ కెమెరాను వాడే ఈ ఫొటోగ్రాఫర్ ఏనాటికైనా తన గురువుగారు రాజన్ లాగే లండన్ యఫ్‌ఆర్‌పియస్ నుంచి ఫెలోషిప్పును పొందాలనేది తన ధ్యేయమని చెబుతుంటారు. వీరి కోరిక త్వరలో తీరాలని ఆశిద్దాం. ★



పిలవని పేరంటం

-సత్య



పిలవని పేరంటం గురించి మన తెలుగువారికి ప్రత్యేకంగా చెప్పాల్సిందేముంటుందీ.

సంబంధాలు సరిగా ఉంటే సరేసరి. లేకపోతే ఎన్ని విబేధాలు, కక్షలూ కార్పణ్యాలున్నా మేనరికాల వద్దకు వచ్చే సరికి పిలుపుతో నిమిత్తం లేకుండా వెళ్లి అడగటం ఒక బాధ్యత, హక్కుగా ఇప్పటికీ భావించేవారిని ఎందరినో చూస్తున్నాం.(ఇక్కడ పేరంటం అంటే మహిళలను కించపరిచే అర్థం కాదు. ఆహ్వానం లేకుండా వెళ్లే ఆడవారైనా, మగవారి చర్యనైనా పిలవని పేరంటంగా పరిగణించాలని మనవి).

ఎన్ని సినిమాలు చూడలేదు ! ఎన్నికథలు చదవలేదూ !! తల్లిదండ్రులతో నిమిత్తం లేకుండా ఒక్కటైన బావామరదళ్లను ఎందరిని చూడలేదు !!!

ఇదే సమయంలో పిలవని పేరంటానికి వెళితే ఏమౌతుందో కూడా మనకు బాగా తెలుసు. తనకు ఇష్టం లేకుండా శివుడ్ని వివాహం చేసుకున్నందుకు సతి తండ్రి దక్షుడు తాను జరిపిన యజ్ఞానికి పిలవకుండా వచ్చినందుకు సతిని నానా మాటలని శివుడ్ని తూలనాడిన కథ సుపరిచితమే కదా. అందుకే ఎవరూ పిలవకుండా పేరంటానికి వెళ్లరు. అలా ఎవరైనా అమెరికాలోని వర్జీనియా రాష్ట్రానికి చెందిన జంట తారెఖ్- మిచెలి సలాహీ మాదిరి వెళ్లారంటే దాని వెనుక పెద్ద కథే ఉంటుంది. ఇంతకూ ఈ జంట ఎవరో ఇంకా చెప్పలేదు కదూ !

గతనెలలో మన ప్రధాని మన్మోహన్‌సింగ్ మహాశయులు అమెరికా పర్యటన జరిపారు. ఆ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఒక విందు ఇచ్చారు. దానికి సందట్లో సడేమియాల్లాగా తారెఖ్-మిచెలి సలాహీ జంట పిలవని పేరంటంగా వెళ్లింది. మన ఇళ్లకు ఎవరైనా అలా పిలవకుండా వస్తే మనవారేం చేస్తారు? మూతి ముడుచుకొని వచ్చిన వారిని చూడనట్లు, ఒకవేళ పొరపాటున చూసినా ఒక వంకర నవ్వు నవ్వి ఎవరో పిలిచారన్నట్లు వారిని తప్పించుకొని పోతారు. ఇతర పేరంటాళ్లు చెవులు కొరుక్కుంటారు.

కానీ ఒక దేశాధ్యక్షుడు, మరో దేశప్రధానికి ఇచ్చే విందంటే ఆషామాషీగా ఉంటుందా? ముందే ఒక జాబితా తయారు చేస్తారు. దాని ప్రకారం ఎవరు ఎక్కడ కూర్చోవాలో కూడా నిర్ణయిస్తారు. వచ్చినవారికి ఆహ్వానం ఉందా లేదా అని భద్రతా సిబ్బంది అడుగడుక్కి తనిఖీ చేసి మరీ వదులు తారు. అందులోనూ అమెరికా వారు ఎంతటి వారైనా అవసరమైతే బట్టలు విప్పించి మరీ తనిఖీ చేస్తారని మన దేశనాయకుల అనుభవం గురించి తెలిసిందే కదా. కానీ ఈ అమెరికా దంపతులు ఎలాంటి తనిఖీ, ఆటంకాలు లేకుండా వచ్చేశారు. రావటమే కాదు ఏకంగా ఒబామాతో కరచాలనం చేసి కుశల ప్రశ్నలు వేశారు. తీరా విందు అయిపోయాక ఎవరికో "వారెవరు? ఎలా వచ్చారు?" అన్న అనుమానం వచ్చింది. గుండెలు బాదుకున్నారు. "అమెరికాలో అందునా అధ్యక్షుడి భవనంలో భద్రతా వ్యవస్థ ఇంత అధ్వానంగా ఉందా? ఆ వచ్చిన వారెవరైనా ఉగ్రవాదులై ఉంటే ఎంత ప్రమాదం జరిగి ఉండేది" అని తత్తరపడ్డారు.పైనుంచి కిందివరకు భద్రతాలోపం ఎక్కడుందో అని ఎవరికి వారు భుజాలు తడుముకున్నారు. ఆనక ఏమి జరిగింది అనేది తరువాత చూద్దాం. ఆహ్వానంలేని ఈ జంటను పార్లమెంటరీ విచారణ సంఘం ముందు హాజరై సంజాయిషీ ఇవ్వాలని వైట్‌హౌస్ ఆదేశించింది. సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ మార్క్ సులివాన్ కూడా హాజరు కావాలని సమన్లు పంపారు.

వాషింగ్టన్ పోస్టు పత్రిక కథనం ప్రకారం వర్షం కురిసిన ఆరాత్రి వచ్చేపోయేవారితో రద్దీగా ఉన్న సమయంలో ఈ జంట "మీది తెనాలే మాది తెనాలే ముఖ్యమంత్రిది తెనాలే" అన్నట్లు సతాయించి తమను లోనికి అనుమతివ్వాలని భద్రతా సిబ్బందిని వత్తిడి చేసి లోపలికి ప్రవేశించింది. ప్రారంభంలోనే తనిఖీ సరిగా జరగలేదని సీక్రెట్ సర్వీసు అధిపతి అంగీకరించారు. ఆయుధాలున్నాయో లేవో చూశారు తప్ప వారికి ఆహ్వానం ఉందా లేదా అన్నది పట్టించుకోలేదని పేర్కొన్నారు.

అమెరికాలో ఏదైనా ఒక సంచలనం జరిగితే కోడిగుడ్డుకు ఈకలు పీకినట్లు చేస్తారు. ఒబామా అనుచరుల్లో రషీద్ ఖలీదీ అనే పాలస్తీనా అనుకూల ప్రొఫెసర్ ఉన్నాడట. వారిద్దరూ కలిసి చికాగో విశ్వవిద్యాలయంలో పనిచేశారు. రషీద్ పాలస్తీనా ఏర్పాటును సమర్థిస్తాడు కనుక అందుకోసం జరిపే పోరాటాన్ని కూడా బలపరుస్తాడు. అలాంటి పోరాట యోధులను అమెరికా ఉగ్రవాదులుగా చిత్రించింది కనుక ఆయన ఉగ్రవాద సమర్థకుడని, ఆ రషీద్‌తో పాటు తారెఖ్ సలాహీ కూడా పాలస్తీనాపై అమెరికా కార్యాచరణ బృందంలో పనిచేసినందున ఉగ్రవాదేమో అని అనుమానిస్తున్నారు కొందరు. ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టటానికి చివరికి ఈ ఉదంతాన్ని కూడా వినియోగించుకొనే యత్నం

దీనిలో కనిపిస్తోంది. అయితే ఈ జంటకు వైట్ హౌస్ అనుమతి ఉందని వారి లాయర్ పాల్ గార్డనర్ చెపుతున్నారు.

రోమ్ వెళితే రోమన్‌లా ఉండాలన్నారు కదా పెద్దలు. అధికార కేంద్రాలు, ధనికుల పార్టీలు, వివిధ సంప్రదాయాలు, దుస్తులు,అలంకరణ, పద్ధతులను ఒంటపట్టించుకున్నవారు ఇలాంటి పిలవని పేరంటాలుగా దర్జాగా వెళ్లటంలో ఘనులు. ఒక వేళ ఆహ్వానాలు లేకపోతే వాటిని తెప్పించుకోగల సమర్ధులు. హైదరాబాదులో ఖరీదైన విందులు ఇచ్చేవారు ఇలాంటి పిలవని పేరంటాల జంటలను నిలిపివేసేందుకు భద్రతా సిబ్బందిని పెడతారు. కొన్ని ప్రాంతాలు అందుకు పేరు మోశాయి. మన వర్జీనియా జంటకూడా అలాంటిదే. వారికి ఒబామా వంటివారితో ఎంతటి సన్నిహిత పరిచయాలు ఉన్నాయో ఫోటోలను చూస్తే తెలుస్తుంది. వారు గతంలో ప్రిన్స్ చార్లెస్, ఓప్రా విన్‌ఫ్రే వంటి బడావ్యక్తుల పార్టీలకు వెళ్లారు. ఇలాంటి పార్టీలలో పాల్గొన్నవారు తిండికి మొహం వాచినవారి మాదిరిగా ఎగబడరు. ఇతరులతో మాట్లాడేందుకు ప్రయత్నించరు. తినీ తినట్లుగా, తాగీ తాగనట్లుగా, పరిచయం లేనివారితో కూడా అలా హాయ్ చెప్పి వారు వీళ్లెవరబ్బా అని బుర్రగోక్కుంటుండగా మరో నలుగురికి హాయ్ చెబుతారు. దాన్ని చూసి అబ్బో వీళ్లెవరో అందరికీ బాగా తెలిసినవారిలా ఉన్నారని ప్రతివారూ అనుకుంటారు. ఎవరితో అయినా మాటలు కలిపితే సందర్భానికి అనుగుణంగా చాలా ఉన్నత విషయాలను ప్రస్తావిస్తారు. అదే ఒబామా, మన్మోహన్ విందులో కాశ్మీర్ సమస్య, భారత జిడిపి వంటి అంశాల గురించి ఎత్తారనుకోండి ఇంక చెప్పేదేముంది. అధికారిక, ఘరానా విందుల్లో మరొక ఇబ్బంది ఉంది. వచ్చే వారందరూ పెద్దలే. వారిని ఎవరైనా అనుమానించి అడిగారనుకోండి వారి ఉద్యోగానికి నీళ్లొదులుకోవాల్సిందే. అందుకు సిబ్బంది కూడా చాలా జాగ్రత్తగా ఉంటారు. మోసగాళ్లకు కావాల్సింది అదేగా. అన్నట్లు పెద్దవాళ్ల వ్యవహారాలు ఎలా ఉంటాయో ఇక్కడొక విషయం చెప్పాలి. రష్యాలో రాజరికం ఉన్న రోజుల్లో ఆంగ్ల రాకుమార్తెలు, ఇటాలియన్ రాకుమారులంటే రష్యన్ రాజరికానికి ఎంతో మోజు. వారితో సంబంధాలు పెట్టుకోవాలంటే చాలా దూరాభారం. అందువల్ల ఎవరైనా అక్కడి నుంచి వస్తే వారితో పరిచయం పెంచుకొనేందుకు తహతహలాడుతుంటారు. ఆ బలహీనతను ఎరిగిన కాగిలిస్ట్రో అనే మాయగాడు రాణి కాథరిన్‌ను బుట్టలో వేశాడు. తాను స్పానిష్ రాజకుటుంబానికి చెందిన వాడినని నమ్మించాడు.తీరా అసలు విషయం బయటపడటంతో రష్యానుంచి బహిష్కరించారనుకోండి.

అమెరికాలో ఘరానా పెద్దలతో ముఖపరిచయం మొదలు చాటు మాటు వ్యవహారాల వరకు అనేక సందర్భాలలో డబ్బు సంపాదించిన ఉదంతాలు ఎన్నో. ఇప్పుడు వర్జీనియా జంట కూడా అదే బాటలో ఉంది. అసలు మీరు ఆహ్వానం లేకుండా వైట్‌హౌస్ పార్టీకి ఎలా వెళ్లగలిగారని అడిగితే ముందు మీరెన్ని డాలర్లు ఇస్తారో చెప్పమని బేరం పెట్టారు. అసలు ఇదంతా ఒక పథకం ప్రకారమే చేశారా అనేందుకు ఆస్కారం కలుగుతోంది. విందుకు వచ్చేందుకు మిచెల్లి ఖరీదైన ఎర్ర చీర కట్టుకొని వచ్చింది. అందుకుగాను జార్జిటౌన్‌లోని బ్యూటీపార్లర్‌కు వెళ్లింది. అక్కడ చేసుకున్న సింగారన్నంతా ఒక టీవీ బృందం చిత్రీకరించింది. విందు ముగియగానే వారొక ప్రతినిధిని ఏర్పాటు చేసుకున్నారు. అతని పని విందుగురించి ప్రచారం చేయటం, ఇంటర్వ్యూలు కోరినవారితో బేరసారాలు చేయటం. ఎన్ని మిలియన్ డాలర్లు ఇస్తారో చెబితే దాన్ని బట్టి నిర్ణయిస్తామని ఇప్పటికే బేరం పెట్టారు.

ఇక్కడ మరొక పిట్ట కథ ఉందండోయ్. ఈ జంటపై ఇప్పటికి 16కేసులు ఉన్నాయట. వాటిలో ఒకటి వాషింగ్టన్ రెడ్‌స్కిన్స్(ఎర్రతోలు) అమెరికన్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో విందులకు వెళ్లేందుకు అవసరమైన దుస్తులను అద్దెకు తీసుకొని చెల్లించాల్సిన 2,24,000 డాలర్లకు విలాసవంతమైన కారుకు 1,50,000 డాలర్లు చివరికి దాన్ని పార్కు చేసినందుకు చెల్లించాల్సిన 65



తారెఖ్- మిచెలి సలాహీ

అమెరికాలో ఘరానా పెద్దలతో ముఖపరిచయం మొదలు చాటు మాటు వ్యవహారాల వరకు అనేక సందర్భాలలో డబ్బు సంపాదించిన ఉదంతాలు ఎన్నో. ఇప్పుడు వర్జీనియా జంట కూడా అదే బాటలో ఉంది. అసలు మీరు ఆహ్వానం లేకుండా వైట్‌హౌస్ పార్టీకి ఎలా వెళ్లగలిగారని అడిగితే ముందు మీరెన్ని డాలర్లు ఇస్తారో చెప్పమని బేరం పెట్టారు. అసలు ఇదంతా ఒక పథకం ప్రకారమే చేశారా అనేందుకు ఆస్కారం కలుగుతోంది. విందుకు వచ్చేందుకు మిచెల్లి ఖరీదైన ఎర్ర చీర కట్టుకొని వచ్చింది. అందుకుగాను జార్జిటౌన్‌లోని బ్యూటీపార్లర్‌కు వెళ్లింది. అక్కడ చేసుకున్న సింగారన్నంతా ఒక టీవీ బృందం చిత్రీకరించింది. విందు ముగియగానే వారొక ప్రతినిధిని ఏర్పాటు చేసుకున్నారు. అతని పని విందుగురించి ప్రచారం చేయటం, ఇంటర్వ్యూలు కోరినవారితో బేరసారాలు చేయటం. ఎన్ని మిలియన్ డాలర్లు ఇస్తారో చెబితే దాన్ని బట్టి నిర్ణయిస్తామని ఇప్పటికే బేరం పెట్టారు.

డాలర్లకూ ఎగనామం పెట్టినవి ఉన్నాయి. తండ్రి ప్రారంభించిన ఒయాసిస్ వైనరీకి ఎం.డీగా పనిచేసిన సలాహీ దానిని చివరకు దివాలా తీయించి కేసులపాలయ్యాడు. చివరికి ఒబామా విందుకు కూడా అప్పుచేసే వెళ్లారన్నది కొసమెరుపు. జార్జిటౌన్‌లోని ఎర్విన్ గోమెజ్ అనే సెలూన్‌కు సాదా సీదా మనుషులు వెళ్లలేరు.మిచెలి వివాహ అలంకరణ కూడా అక్కడే జరిగిందట. తన షాపుకు వచ్చే వారందరూ పెద్దవారే నని ఘరానా విందులకు వచ్చిన ఆహ్వానాలను తను చూపుతుంటారని సెలూన్ డైరెక్టర్ పాకార్డ్ గోమెజ్ చెప్పారు. అసలు ఆరోజు పార్టీకి వెళ్లిన 'ఏ' తరగతి జాబితాలో ఉన్న అనేక మందికి ఆహ్వానాలు లేవని , మిచెలిని మాత్రమే ఎందుకు తప్పుపట్టాలని ప్రశ్నించారు. ఇంతకీ అసలు విషయం ఏమంటే ఈ కిలాడీ జంటకు అసలు ఒబామా పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పటి నుంచే పరిచయం ఉందన్న వార్తలు గుప్పుమన్నాయి. అయితే నిజం ఏమిటో చెప్పేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. అయితే ఇది ఎంత వరకు నిజం అంటే అందుకు వచ్చే వారం వరకు ఆగాలి మరి !

★

కొత్త పుస్తకాలు

ఎన్నో సందేహాలకు సమాధానం

శిశుసంరక్షణ,
డా॥కర్రా రమేష్ రెడ్డి,
ధర:80/-, పేజీలు 162,
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

ఆరోగ్యకరమైన జీవనం మానవునికి ఎంతో ప్రధానమైనది. ఇది సమాజ పురోగతిని, ప్రజల జీవన స్థాయిని ప్రతిబింబిస్తుంది. శిశువు గర్భంలోకి చేరకముందే ఆరోగ్యానికి పునాదిరాయి పడుతుందంటే అతిశయోక్తికాదు. అది తల్లిదండ్రుల ఆరోగ్య పరిస్థితి, ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్య విషయాలపై ఆధారపడి వుంటుంది. గర్భస్థ శిశువుగా వున్నప్పుడు, జన్మించాక... మొదటి కొన్ని సంవత్సరాల ఆలనా పాలనా వారి భవిష్యత్తును కొంతవరకు నిర్ణయిస్తుంది. అంత ప్రాధాన్యత కలిగిన ఈ సమయంలో పుట్టబోయే బిడ్డకు ఎటువంటి ఆహారం ఇవ్వాలి? తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనా? ఇవ్వకపోతే ఏమౌతుంది? డబ్బా పాలు ఇస్తే సరిపోదా? వ్యాధి నిరోధక టీకాలు ఎప్పుడు చేయించాలి? వంటి ఎన్నో అనుమానాలు కాబోయే తల్లికి రావడం సహజం. అటువంటి ఎన్నెన్నో సందేహాలకు సమాధానమే డా॥కర్రా రమేష్ రెడ్డి 'శిశుసంరక్షణ' పుస్తకం. కొత్తగా తల్లిదండ్రులు కాబోతున్నవారు చదవాల్సిన పుస్తకమిది.

రచయిత గత 20 సంవత్సరాలుగా శిశు ఆరోగ్యం గురించిన పుస్తకాలు ఎన్నో రాశారు. అందులో తల్లిపాలు, టీకాలు, అదనపు ఆహారం, అతిసారవ్యాధి వంటివి వున్నాయి. వీటికి తాజాగా శ్వాసకోశవ్యాధులను చేర్చి 'శిశుసంరక్షణ' పుస్తకాన్ని ప్రచురించారు. తల్లిపాల ఆవశ్యకత ఏంటి? తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనమేమిటి? సీసా పాల వల్ల కలిగే అనర్థాలేమిటి? గర్భిణీ ఆహారావసరాలు, రొమ్ము నిర్మాణం, తల్లిపాలలో ఏముంటుంది? తల్లిపాలలో రకాలు ...వంటి విషయాలన్నిటికీ డాక్టర్‌గారు సవివరంగా తెలియచేశారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలు పిల్లల అవసరాలను తీర్చలేవు. అటువంటప్పుడు బిడ్డకు అదనంగా ఇవ్వాల్సిన ఆహారమేంటి? ఎప్పుడు ఎంత మోతాదులో ఏం ఇవ్వాలి? వంటి వివరాలతోపాటు....ఇంట్లోనే బిడ్డకోసం సురక్షితంగా తయారుచేసే పదార్థాల గురించి కొలతలతో సహా చెప్పారు. పైగా ఆ సమయంలో పెద్దలు పాటించాల్సిన పరిశుభ్రత గురించి చెప్పారు.

అతిసారవ్యాధితో బిడ్డ బాధపడుతోంటే ఇవ్వాల్సిన ఆహారం గురించి వివరించారు. శ్వాసవ్యవస్థ సంబంధ వ్యాధుల గురించి, అసలు అవి ఎందుకు వస్తాయి? ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. జనన సమయం నుంచి 18 మాసాల వరకు బిడ్డకు ఇవ్వాల్సిన వ్యాధినిరోధక టీకాల గురించిన సంపూర్ణసమాచారం ఈ పుస్తకంలో లభిస్తుంది. మొదటిసారిగా అమ్మానాన్న కాబోతున్న వారికి ఎంతగానో ఉపకరించే పుస్తకమిది. వైద్యసంబంధ విషయాలు అర్థమౌతాయో లేదోనని భయపడనవసరం లేదు. సులభంగా అందరికీ అర్థమయ్యే రీతిలో వుంది.

- సాహిల్.కె

మధ్యతరగతి గాథలు

ఈ గ్రంథంలోని కథలన్నీ దాదాపు అన్ని పత్రికల్లో ప్రచురణైనవే - ఆంధ్రభూమి, రచన, ఆదివారం , ఈనాడు విపుల నవ్య, పత్రిక, సాహిత్యనేత్రం పత్రికల్లో ప్రచురణైనవి. రచయిత్రి ఈ కథాసంపుటిని తన తల్లిదండ్రులైన కళ్ళే గాయిత్రిదేవికి, శంకర శాస్త్రిగార్లకు అంకితం చేసింది. 1966 నాటికి ఆంధ్రప్రభలో " మనిషి- మమత" సీరియల్ వచ్చింది వీరిది. "విమెన్ నావలిస్ట్" మీద పి.హెచ్.డి. థీసిస్ చేసిన వీరి రచన విశేష పాఠక అభిమానం పొందింది. బాపు ముఖచిత్రం పాఠకుణ్ని పుస్తకం వైపు తీసుకెళు తుంది. కథలన్నీ మధ్య తరగతి కుటుంబాలగాథలే. వస్తువు, శిల్పం భాషపై పట్టు ఎకబిగువున కథను చదివించడం వీరి శైలి ప్రత్యేకత. కథలలోని పేర్లు చాలా తమషాగా అనిపిస్తాయి. 'తండ్రి మనసు' (పేజీ-128) కథలోని పేర్లు హరిహరరావు, విశ్వామిత్ర, ఇందీ వరాక్షి లాంటివి కృత్రిమంగా అనిపిస్తాయి. వేర్లులేని మొక్కలు" (పేజీ- 40) చాలా మంచికథ - ఈనాడు ఆదివారంలో ప్రచురణైన కథ. సర్కార్ సాగిస్తున్న (సెజ్‌ల ముసుగులో) భూ కబ్జాలను పరోక్షంగా తెలియజేసే కథ. నేడు నూటికి 80% మంది పేదలు- శ్రామికులు, వ్యవసాయరైతాంగం గ్రామసీమల్లో నానాబాధలు పడుతున్నారు. వేర్లు లేని మొక్కలు... తరహా కథలు.. మన పాఠకలోకానికి ఎంతో అవసరం. 'చైతన్యం' (పేజీ 118) కూడా చాలా మంచికథ. అట్టడుగు వర్గాల ఆక్రోశాన్ని బలంగా అక్షరీకరించిన 'మీరా' సుబ్రహ్మణ్యం అభినందనీయురాలు. కథాసంపుటిలో అన్ని రకాల కథలు 'ఆణి ముత్యాలు'.

- తంగిరాల చక్రవర్తి

వెన్నెల దీపాలు (కథలు)
డా॥ తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం.
పేజీలు : 132
వెల : 75/ -రూ॥,
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.



అదిరెనులే

ప్రకృతి అంటేనే వైవిధ్యం. జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, మానవులు, పూలు, కాయలు, చెట్లు... ఇలా చెప్పకుంటూ పోతే రోజులు నెలలౌతాయ్. నెలలు సంవత్సరాలౌతాయ్. మనకు నిత్యం తారసపడే వీటినుంచే స్ఫూర్తి పొందుతాం. కొత్తవాటిని సృష్టిస్తుంటాం. ఇప్పుడు మీ ముందున్న చిత్రరాజాలనే చూడండి. ఇందాక మనం చెప్పకున్న జాబితా అంతా కళ్లముందు సాక్షాత్కరించినట్టు లేదూ! కాకపోతే ఇవన్నీ పళ్లు, కూరగాయలతో చేసినవేనంటే కూసింత ఆశ్చర్యం కలగొచ్చు. కానీ పరీక్షగా చూడండి. క్యారెట్లు, కీరాలు, గుమ్మడిపళ్లు, పుచ్చకాయలు, ముల్లంగి...కనిపిస్తాయి. కనిపించాయా! అదే మరి అర్థంటే...!!

బహుమతి



- కె.చరిత

అనగనగా ఓ రైతు వుండేవాడు. అతనికి కొద్దిగా పొలం వుంది. దాన్నే కష్టపడి సేద్యం చేసేవాడు. అతని కుటుంబానికి ఆ కొద్దిపాటి పొలమే ఆధారం. ఎప్పడూ ఆ పొలంలోనే పనిచేస్తుండేవాడు. అయితేనేం! అతని సంపాదన తిండికి, గుడ్డకు మాత్రమే సరిపోయేది. దాంతో ఎప్పడూ దరిద్రమే. రైతుకి ఓ కొడుకు వుండేవాడు. అతను తన తండ్రి చేసే కష్టాన్ని గమనిస్తుండేవాడు. 'నాన్న ఎప్పడూ పనిచేస్తుంటాడుకదా. అయినా ఎక్కువ డబ్బులు రావెందుకు?' అనుకునేవాడు. తను ఎలాగైనా సరే పెద్ద చదువులు చదువుకొని నాన్న కష్టాలు తీర్చాలనుకుంటాడు. అప్పడు మాత్రమే తనకు మంచి ఉద్యోగం వస్తుందని అతని ఆశ. అందుకే తండ్రి దగ్గరకెళ్లి...

'నాన్నా! నేను గురుకులంలో చదువుకోవాలనుకుంటున్నాను. పంపిస్తావా?' అనడుగుతాడు.

తండ్రి సంతోషంగా పంపిస్తాడు. అక్కడ మంచి తెలివిగల విద్యార్థిగా పేరు సంపాదిస్తాడు. కాలం గిర్రున తిరుగుతుంది. అతని చదువయ్యాక ఇంటికి తిరిగొస్తాడు. అతని తండ్రి మాత్రం ఇంకా అలాగే పొలంలో కష్టపడుతూ కనిపిస్తాడు. అది అతనికి బాధ కలిగిస్తుంది. అందుకే రాజుగారి దగ్గరకెళ్లి ఏదైనా ఉద్యోగం సంపాదించాలనుకుంటాడు. తండ్రితో విషయం చెప్పి రాజధాని చేరుకుంటాడు.

రాజును కలిసి కొలువు ఇమ్మంటాడు. ఇతని తెలివితేటలను పరీక్షించిన రాజు సంతోషంగా రాజమందిరంలోనే ఉద్యోగం ఇస్తాడు. దాంతో రైతు కుమారుడు అక్కడే వుండిపోతాడు. కానీ గ్రామంలో రైతు మాత్రం అలాగే కష్టపడుతుంటాడు. అతని పనిలో ఏమాత్రం మార్పురాదు.

పైగా అతనికి వ్యవసాయంలో ఎంతగానో సాయం చేసే ఎడ్లలో ఒకటి చనిపోతుంది. కొడుకునడిగి ఎద్దును కొనిపించుకుందామనుకొని వెళతాడు రైతు.

రాజధానిలో కుమారుడి ఉద్యోగం, ఇల్లు, హోదా చూసి సంతోషిస్తాడు. భోజనాలయ్యాక మెల్లగా విషయం చెప్తాడు.

"కన్నా! ఒక ఎద్దు చచ్చిపోయింది. రాజునడిగి ఇప్పిస్తే నేను సంతోషిస్తాన్రా' అంటాడు.

దానికి కుమారుడు "నాన్నా! ఇంకా నువ్వు ఈ వయసులో కూడా అక్కడ కష్టపడడమెందుకు? నాకు ఉద్యోగం వచ్చిందికదా ఇక్కడకు వచ్చేసెయ్. నిన్ను బాగా చూసుకుంటాను" అంటాడు.

"ఒరేయ్! నేను చిన్నప్పటినుంచి అక్కడే పెరిగాను. నా జీవితం అంతా అక్కడే గడిచిపోయింది. ఈ చివరి దశలో ఇంక ఎక్కడికీ రాలేను. ఈ కట్టె అక్కడ కాలిపోవాల్సిందే. నాకు ఒక ఎద్దు ఇప్పించు చాలు" అంటాడు.

"అది కాదు నాన్నా! నేనా కొత్తగా ఉద్యోగంలో చేరాను. రాజుగారిని డబ్బడిగితే ఎందుకని అడగొచ్చు. అలాగని రాజుగారి డబ్బు చెప్పాపెట్టకుండా వాడుకోవడం నాకు ఇష్టంలేదు. రాజు చాలా మంచివాడు. ఇవాళ సాయంత్రం దర్బారు తీసుకెళతాను. నువ్వే అడుగు" అంటాడు రైతు కొడుకు.

"లేదు...లేదు. నేను మహారాజుగారితో మాట్లాడడమా! నాకు సరిగా మాట్లాడ్డం రాదు. నేను చదువు రాని మొద్దుని. నువ్వే ఏదోఒకటి చెప్ప" అంటాడు రైతు కంగారుగా.

"రాజుని చూసి ఎందుకు భయపడతావ్! ఇప్పడు నువ్వు నాతో ఎలా మాట్లాడుతున్నావో ఆయనతో కూడా అలాగే మాట్లాడు" అంటాడు.

అయినప్పటికీ రైతు ఒప్పకోడు. దాంతో రైతు కుమారుడు ఒక ఆలోచన చేసి "సరే! నేను చెప్పినట్టు రాజుగారికి చెప్పేసెయ్. అదనంగా ఒక్కమాట కూడా మాట్లాడక్కర్లేదు. సరేనా." అంటూ... దర్బారులో చెప్పాల్సిన మాటలు చెప్తాడు

"ఓ రాజా! నేను మా గ్రామంలో వ్యవసాయం చేస్తుంటాను. ఈ మధ్య ఒక ఎద్దు చనిపోయింది. దాంతో వ్యవసాయం కష్టంగా వుంది. దయచేసి ఒక ఎద్దుని ఇప్పించు".

♦♦♦

ఇద్దరూ కలిసి రాజదర్బారు చేరుకుంటారు. రాజు వాళ్లని చూచి నవ్వుతూ

"బావున్నావా! ఏం కావాలి? వ్యవసాయం బాగా వుందా?" అంటాడు.

రాజు ఈ ప్రశ్నలు అడుగుతాడని ఊహించని రైతు కంగారుపడతాడు. పైగా తన కుమారుడు చెప్పిన వాటిలో కూడా ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. దాంతో మరింత ఇబ్బందిపడిపోయి...

"మీకు ఓ ఎద్దును ఇద్దామని వచ్చాను" అన్నాడు.

దానికి సభలోనివారంతా పగలబడినవ్వారు. ఆఖరుకు రాజుకూడా నవ్వేశాడు. దాంతో రైతు మరింత కంగారు పడిపోయి...తన ఎద్దు చనిపోవడం గురించి పూసగుచ్చినట్టు చెప్పేసి "ఒక్క ఎద్దుతో వ్యవసాయం చెయ్యలేను కాబట్టి.... మిగిలిన ఒక ఎద్దును తమరికి సమర్పించుకుందామని వచ్చాను రాజా" అంటాడు.

దానికి రాజు ఎంతో సంతోషపడిపోయి..."చూశారుగా. మామూలు వాళ్లైతే ఒక ఎద్దు చనిపోతే రెండవ ఎద్దు సంపాదించడం ఎలా? అని ఆలోచిస్తారు. కానీ ఇతగాడు. తన పేదరికం వల్ల మరో ఎద్దును కొనలేక...నోరుతెరిచి అడగలేక...వున్న ఒక ఎద్దుని నాకు బహూకరించాలని వచ్చాడు. అతని మంచితనానికి బహుమతిగా ఆరు జతల ఎద్దుల్ని ఇవ్వదలచుకున్నాను" అన్నాడు. సభలోని వారంతా చప్పట్లు చరిచారు. సమస్య పరిష్కారం అయినందుకు రైతు, అతని కుమారుడు సంతోషించి ఇంటికి బయలుదేరతారు.